దేశరాజధాని ఢిల్లీలో
ఈరోజు బంగారం ధర
తులం బంగారం
(10 గ్రాములు)
1,39,650/-
(22 క్యారెట్స్)
1,52,350/-
(24 క్యారెట్స్)


## సిరా చుక్క

జర్నలిస్ట్...
సమాజ చైతన్యానికి శంఖారావం!
అలుపెరగని పోరాటాలకు ప్రతిరూపం...
అలసిపోని కర్తవ్యబాధ్యతకు నిలువుటద్దం...
కష్టాల జీవనంలోనూ కలం వదలని
యోధుడు...సామాన్యుల సమస్యలకు
స్వరమై నిలిచేవాడు...
దగాపడుతున్న దయనీయులకు చేయూతగా...
ఆసరాలు కరువైన అభాగ్యులకు అండగా...
నిజాన్ని నిలబెట్టేందుకు నిరంతర పోరాటం...
న్యాయాన్ని కాపాడేందుకు నిత్యం ఆరాటం...
ప్రజలకు —— ప్రభుత్వానికి వారధియై...
ప్రశ్నలతో పాలకులను నిలదీస్తూ...
కష్టజీవుల వ్యథలను ప్రపంచానికి వినిపిస్తూ...
కన్నీటి వెనుక దాగిన కథలను వెలికితీస్తూ...
సమాజ చైతన్యానికి శంఖం మ్రోగిస్తూ...
చీకటిలో వెలుగురేఖను చూపిస్తూ...
అన్యాయంపై అక్షరాన్ని ఆయుధంగా మలుస్తూ...
సరికొత్త ప్రపంచానికి దారి చూపిస్తూ...
ప్రతి నిత్యం పరుగులమయమే అతని జీవితం...
ప్రతి వార్త వెనుక ఒక బాధ్యత...
ప్రతి అక్షరం వెనుక ఒక నిజం...
ప్రతి ప్రశ్న వెనుక ప్రజల పక్షం...
తన కష్టాన్ని మరచి...
ఇతరుల కన్నీటిని తుడిచేందుకు
పరుగెత్తేనిలువెత్తు కష్టజీవి...జర్నలిస్ట్!
కలం అతని ఆయుధం...
నిజం అతని నినాదం...
న్యాయం అతని లక్ష్యం...

– వారే వేణు గోపాల్.....,
పాపన్నపేట...
2మెదక్ జిల్లా..


# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 | సంచిక: 24 | ఎడిటర్: మేనం శ్యామ్ | బుధవారం 12-08-2026 | పేజీలు: 10


## తెలంగాణలో రోడ్డు ప్రమాదాల కలకలం

# ఏడాదిలో 7,687 మంది మృతి!





- గతేడాది ప్రమాదాల్లో 32 వేల మందికిపైగా గాయాలు
- 80-85 శాతం ప్రమాదాలకు అతివేగమే కారణం!
- 3,878 మంది ద్విచక్ర వాహనదారులు మృతి
- ప్రమాద మృతుల్లో సగానికి పైగా బైక్ ప్రయాణికులే!
- 1,632 మంది పాదచారులు మృతి
- మరో 3,824 మందికి గాయాలు!
- రోడ్డు ప్రమాద మృతుల్లో ప్రతి 10 మందిలో ఏడుగురు ద్విచక్ర వాహనదారులు, పాదచారులే!



**ఏ వాహనాల్లో ఎంతమంది మృతి?**

ద్విచక్ర వాహనాలు – 3,878 మంది
కార్లు, ట్యాక్సీలు – 576 మంది
ట్రక్కులు – 338 మంది
ఆటోలు – 300 మంది
బస్సులు – 112 మంది
పాదచారులు, ఇతరులు – 2,483 మంది

**రోడ్డు ప్రమాదాల గణాంకాలు చూస్తే..**

ద్విచక్ర వాహనదారులు, పాదచారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం స్పష్టమవుతోంది. వేగ నియంత్రణ, హెల్మెట్ వినియోగం, పాదచారుల మౌలిక సదుపాయాలు, ట్రాఫిక్ నిబంధనల కఠిన అమలుతోనే ప్రమాదాలను గణనీయంగా తగ్గించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

**ప్రజా వాయిస్, బ్యూరో :** తెలంగాణలో రోడ్డు ప్రమాదాలు ఆందోళనకర స్థాయిలో కొనసాగుతున్నాయి. మితిమీరిన వేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వంటి కారణాలతో ప్రతి ఏడాది వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. రాష్ట్రంలో 2025లో జరిగిన రోడ్డు ప్రమాదాలను రవాణా శాఖ విశ్లేషించగా.. మొత్తం 7,687 మంది మృతి చెందగా, 32 వేల మందికిపైగా గాయపడినట్లు వెల్లడైంది. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా అధికారులు దృష్టి సారించారు.

**7,687 మంది మృతి..**
**6,701 మంది పురుషులు!**


2025లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 6,701 మంది పురుషులు, 986 మంది మహిళలు

మిగతా 2లో

## రేవంత్ బ్రదర్స్ షెల్ కంపెనీల

# బాగోతం బయటపెడతాం

- టెస్రాక్ట్‌కు వేల కోట్ల భూములు ఎలా కేటాయించారు?: కేటీఆర్
- కొండల్‌రెడ్డి టెస్రాక్ట్ సంస్థకు చైర్మన్‌గా ఉన్నానని ఆయనే చెప్పారు
- టెస్రాక్ట్‌లో ఒక్క ఉద్యోగి కూడా లేరు.
- అలాంటి కంపెనీకి వేల కోట్ల విలువైన భూములు ఎలా ఇచ్చారు?
- రేవంత్ బ్రదర్స్ సూటు, బూట్లతో కంపెనీలు ఎలా ఏర్పాటు చేశారు?
- కొండల్‌రెడ్డికి టెస్రాక్ట్‌తో సంబంధం లేదని మంత్రి శ్రీధర్‌బాబు ఎలా చెబుతారు?
- కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు!




**ప్రజా వాయిస్, బ్యూరో :** తెలంగాణ రాజకీయాల్లో మరోసారి అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం ముదిరింది. సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. రేవంత్ బ్రదర్స్‌కు సంబంధించిన షెల్ కంపెనీల బాగోతాన్ని త్వరలో బయటపెడతామని కేటీఆర్ హెచ్చరించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. టెస్రాక్ట్ సంస్థ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని, మంత్రులను పలు ప్రశ్నలు

మిగతా 2లో

## సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- కూలీల ఆటోను ఢీకొన్న ఆయిల్ ట్యాంకర్!
- ఏడుగురు కూలీలు దుర్మరణం
- మృతుల్లో ఆరుగురు మహిళలు, ఒక పురుషుడు!
- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు
- జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలింపు!
- వ్యవసాయ పనులు ముగించుకుని స్వగ్రామానికి వెళ్తుండగా విషాదం
- ఆటోలో 14 మంది ఉన్నట్లు సమాచారం!
- కర్ణాటకలోని బీదర్ జిల్లా రాజగిరికి చెందిన వ్యవసాయ కూలీలుగా గుర్తింపు
- మృతుల కుటుంబాలకు సమాచారం!

2 లో

## టెసరాట్ భూ కేటాయింపులపై

# కేటీఆర్ ఆరోపణలు అవాస్తవం

- నిబంధనల ప్రకారమే భూములు ఇచ్చాం: శ్రీధర్‌బాబు
- సీఎం సోదరులకు టెసరాట్‌తో ఎలాంటి సంబంధం లేదు
- సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా ఆరోపణలు సరికాదు!
- 32 సంస్థలు దరఖాస్తు చేసుకుంటే.. అందులో టెసరాట్ ఒకటి !
- బోర్డు నిర్ణయించిన ధర కంటే రూపాయి కూడా తక్కువకు భూములు ఇవ్వలేదు!
- బీఆర్ఎస్ హయాంలో ఎకరం రూ.90 లక్షలు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరం రూ.1.50 కోట్లకు కేటాయించింది!



ప్రజా వాయిస్, బ్యూరో : టెసరాట్ సంస్థకు భూ కేటాయింపుల అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలను తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు తీవ్రంగా ఖండించారు. టెసరాట్ సంస్థకు భూముల కేటాయింపులో ఎలాంటి అవకతవకలు జరగలేదని.. పూర్తిగా నిబంధనల ప్రకారమే కేటాయింపులు చేపట్టామని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరులకు టెసరాట్ సంస్థతో ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. హైదరాబాద్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో శ్రీధర్‌బాబు ఈ వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2లో

## డ్యాన్సర్స్ అసోసియేషన్ వివాదంపై జానీ మాస్టర్ కీలక వ్యాఖ్యలు

- 'నేనేమైనా తప్పు మాట్లాడితే క్షమించండి'!
- తెలిసీ తెలియక జరిగిన తప్పిదాలు గా భావించి పెద్ద మనసుతో మన్నించాలని సినీ పరిశ్రమకు విజ్ఞప్తి!
- ఫిలిం ఛాంబర్, ఫెడరేషన్‌తో వివాదం సమసిపోయింది.. అందరి సహకారం కావాలి!
- డ్యాన్సర్లకు నిర్మాతలు ఇచ్చిన డబ్బు పూర్తిగా అందడం లేదన్నదే నా ఆవేదన!
- చిరంజీవితో పాటు పరిశ్రమ పెద్దలు నా అభిప్రాయాన్ని అర్థం చేసుకున్నారు
- సామరస్యంగా సమస్య పరిష్కరించుకుంటాం!

2 లో

## తెలంగాణలో ముగిసిన ఓటర్ల జాబితా సవరణ

- 3.38 కోట్ల మంది ఓటర్లు!
- ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తి
- రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల లెక్కింపు ముగింపు!
- 2.64 కోట్ల ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్
- 78.30 శాతం నమోదు!
- 73.39 లక్షల ఫారాలు సేకరించలేకపోయిన అధికారులు
- 21.70 శాతం అన్‌కలెక్టబుల్‌గా గుర్తింపు!
- 45.18 లక్షల మంది శాశ్వతంగా వలస వెళ్లినట్లు గుర్తింపు
- 9.22 లక్షల మంది మృతి!



**ప్రజా వాయిస్, బ్యూరో :** తెలంగాణలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల వివరాలను సేకరించిన అధికారులు..

మిగతా 2లో

## పార్టీ మారడం ఇష్టం లేదు

- కేసీఆర్‌ను మోసం చేయాలని అనుకోలేదు: పోచారం
- మంత్రి పదవి, డబ్బు కోసం కాంగ్రెస్‌లో చేరలేదు
- నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారాను!
- 6 నెలల్లో పెండింగ్ బిల్లులు మంజూరు చేస్తామని సీఎం రేవంత్ హామీ.. ఇప్పటివరకు సగం నిధులే విడుదల!
- 'నేను నీకు అమ్ముడుపోయానా.. నా ఎమ్మెల్యే పదవిని కొన్నావా?' అంటూ సీఎం రేవంత్‌ను ప్రశ్నించా!
- అన్నం పెట్టిన వారిని ఎప్పటికీ మర్చిపోలేను
- కేసీఆర్ హయాంలోనే బాన్సువాడ అభివృద్ధి!



**ప్రజా వాయిస్, బ్యూరో :** బాన్సువాడ ఎమ్మెల్యే, తెలంగాణ అసెంబ్లీ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన పార్టీ మార్పుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవి కోసమో.. డబ్బుల కోసమో తాను కాంగ్రెస్ పార్టీలో చేరలేదని స్పష్టం చేశారు. కేవలం బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధి కోసమే

మిగతా 2లో

## ఆర్ఎంపీ వైద్యం వికటించి విద్యార్థిని మృతి

- బోనాల పండుగ వేళ విషాదం!
- ఖమ్మం జిల్లా బస్వాపురంలో విషాద ఘటన
- చికిత్స సమయంలో స్పృహ కోల్పోయిన బాలిక!
- ఇంజెక్షన్ ఇస్తుండగా నోటి నుంచి నురగ
- ఖమ్మం ఆస్పత్రికి తరలించేలోపే మృతి!
- ఆర్ఎంపీ వైద్యం చేసే సమయంలో మద్యం సేవించి ఉన్నాడని కుటుంబ సభ్యుల ఆరోపణ!
- బాలిక తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు
- పరారీలో ఉన్న ఆర్ఎంపీ కోసం పోలీసుల గాలింపు!

2 లో

# తెలంగాణలో ముగిసిన ఓటర్ల జాబితా సవరణ

మొదటి పేజీ తరువాయి

వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తవడంతో రానున్న రోజుల్లో ఓటర్ల తుది జాబితాలో గణనీయమైన మార్పులు చోటు చేసుకునే అవకాశం కనిపిస్తోంది.

**2.64 కోట్ల ఫారాల డిజిటలైజేషన్!**

ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్‌లో భాగంగా సేకరించిన ఫారాల్లో దాదాపు 2.64 కోట్ల ఫారాలను డిజిటలైజేషన్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం ఫారాల్లో 78.30 శాతం డిజిటలైజేషన్ పూర్తయినట్లు తెలిపారు. మరోవైపు, భారీ సంఖ్యలో ఎన్యూమరేషన్ ఫారాలు సేకరించలేకపోయినట్లు అధికారులు గుర్తించారు.

**73.39 లక్షల ఫారాలు అన్‌కలెక్టబుల్!**

రాష్ట్రవ్యాప్తంగా 73.39 లక్షల ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించలేకపోయినట్లు అధికారులు వెల్లడించారు. వీటిని మొత్తం ఫారాల్లో 21.70 శాతం అన్‌కలెక్టబుల్‌గా గుర్తించారు. ఫారాలు అందుబాటులో లేకపోవడానికి ప్రధాన కారణాలను అధికారులు వర్గాల వారీగా గుర్తించారు.

**45.18 లక్షల మంది శాశ్వతంగా వలస..**

ఎన్యూమరేషన్ సందర్భంగా భారీ సంఖ్యలో ఓటర్లు తమ పాత చిరునామాల్లో అందుబాటులో లేరని గుర్తించారు. ఇందులో 45.18 లక్షల మంది శాశ్వతంగా వలస వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. మరో 9.22 లక్షల మంది మరణించినట్లు నమోదు చేశారు. దీంతో వీరి పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగుతున్నాయా లేదా అన్న అంశంపై అధికారులు పరిశీలన చేపట్టినట్లు తెలుస్తోంది.

**11.25 లక్షల మంది ట్రేస్ కాలేదు..**

ఇక 11.25 లక్షల మంది ఓటర్లు అందుబాటులో లేరని లేదా ట్రేస్ కాలేదని అధికారులు గుర్తించారు. మరో 6.70 లక్షల మంది ఇప్పటికే ఇతర ప్రాంతాల్లో ఓటర్లుగా నమోదై ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఒకే వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో ఓటరుగా నమోదై ఉన్న అవకాశాలపైనా అధికారులు దృష్టి సారించారు.

**తుది ఓటర్ల జాబితాలో కీలక మార్పులు?**

ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తవడంతో ఇప్పుడు తదుపరి దశలో అధికారులు వివరాలను పరిశీలించి, అర్హులైన ఓటర్లను కొనసాగిస్తూ.. మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, ఇతర ప్రాంతాల్లో ఇప్పటికే నమోదైన వారి వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం తెలంగాణ ఓటర్ల జాబితాలో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# ఏడాదిలో 7,687 మంది మృతి!

మొదటి పేజీ తరువాయి

మృతి చెందారు. అతివేగం, రాత్రి వేళల్లో ప్రయాణాలు, ప్రమాదకర డ్రైవింగ్ వంటి అంశాలు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా గుర్తించారు. మొత్తం రోడ్డు ప్రమాదాల్లో ★80 నుంచి 85 శాతం ప్రమాదాలు మితిమీరిన వేగం కారణంగానే★ జరుగుతున్నట్లు రవాణా శాఖ విశ్లేషణలో తేలింది.



**బైక్‌లే అత్యంత ప్రమాదకరం.. 3,878 మంది మృతి!**

రాష్ట్రంలో గతేడాది ద్విచక్ర వాహన ప్రమాదాల్లోనే అత్యధికంగా ★3,878 మంది★ ప్రాణాలు కోల్పోయారు. కార్లు, ట్యాక్సీల ప్రమాదాల్లో 576 మంది, ట్రక్కుల ప్రమాదాల్లో 338 మంది, ఆటో ప్రమాదాల్లో 300 మంది, బస్సు ప్రమాదాల్లో 112 మంది మృతి చెందారు. బైక్‌లపై జరిగిన ప్రమాదాల్లో నమోదైన మరణాలు కార్లతో పోలిస్తే దాదాపు ఏడు రెట్లు అధికంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

**ప్రమాద మృతుల్లో సగానికి పైగా ద్విచక్ర వాహనదారులే!**

2025లో మొత్తం రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందినవారిలో ★50 శాతానికి పైగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించినవారే★ ఉన్నారు. మరో ★21 శాతానికి పైగా పాదచారులు★ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అంటే రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన ప్రతి 10 మందిలో దాదాపు ఏడుగురు ద్విచక్ర వాహనదారులు, పాదచారులే ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

**రోడ్డుపై నడుస్తున్నా.. ప్రమాదమే!**

వాహనాలు నడపకపోయినా, వాటిలో ప్రయాణించకపోయినా కేవలం రోడ్డు దాటే సమయంలో లేదా రోడ్లపై నడుస్తున్న సమయంలో పాదచారులు ప్రమాదాలకు బలవుతున్నారు. గతేడాది ★1,632 మంది పాదచారులు మృతి చెందగా.. 3,824 మంది గాయపడ్డారు.★ దీంతో పాదచారుల భద్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని రవాణా శాఖ గుర్తించింది.

**డ్రైవర్ల కంటే ప్రయాణికులు, పాదచారులే ఎక్కువగా బలి!**

గతేడాది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందినవారిలో వాహనాలు నడిపిన వారు ★3,632 మంది★ ఉండగా.. పాదచారులు, ప్రయాణికులు కలిపి ★4,055 మంది★ ఉన్నారు. గాయపడిన వారిలో డ్రైవర్లు ★13,684 మంది★ కాగా.. పాదచారులు, ప్రయాణికులు ★18,969 మంది★ ఉన్నారు.

**బస్సుల్లో మరణాలు తక్కువ.. రోజూ లక్షలాది మంది ప్రయాణం!**

రాష్ట్రంలో బస్సు ప్రమాదాల్లో గతేడాది మొత్తం ★112 మంది★ మృతి చెందారు. వీరిలో 105 మంది ప్రయాణికులు కాగా.. ఏడుగురు డ్రైవర్లు ఉన్నారు. ఆర్టీసీ బస్సుల్లో రోజుకు సగటున 55 నుంచి 60 లక్షల మంది ప్రయాణిస్తుండగా.. ఏడాదికి సుమారు 200 నుంచి 219 కోట్ల మంది ప్రయాణిస్తున్నారు. ఇతర వాహనాలతో పోలిస్తే బస్సు ప్రమాదాల్లో మరణాల సంఖ్య తక్కువగా ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

**బ్లాక్‌స్పాట్ల గుర్తింపు.. కెమెరాలతో వేగ నియంత్రణ!**

రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి బ్లాక్‌స్పాట్లను శాస్త్రీయంగా అభివృద్ధి చేయాలని అధికారులు సూచిస్తున్నారు. రహదారుల రూపకల్పనలో భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడం, వేగ నియంత్రణ చర్యలు చేపట్టడం, ఆటోమేటెడ్ కెమెరాలను విస్తరించడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు. యువతకు రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

**పాదచారులు, ద్విచక్ర వాహనదారులపై ప్రత్యేక దృష్టి!**

ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ సూచించింది. ట్రాఫిక్ నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయడంతోపాటు పాదచారుల కోసం ప్రత్యేక క్రాసింగ్లు, ఫుట్‌పాత్‌లు, మెరుగైన సిగ్నలింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపింది.

**ప్రమాదాలకు ప్రధాన కారణాలివే!**

వాహనాల అధిక వేగం, హెల్మెట్ వినియోగించకపోవడం, పాదచారుల కోసం భద్రతా మౌలిక సదుపాయాల కొరత, ట్రాఫిక్ నిబంధనల అమలులో లోపాలు ప్రధాన కారణాలుగా అధికారులు గుర్తించారు. నగరాలు, పట్టణాలతో పాటు గ్రామీణ రహదారులపైనా భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

# టెసరాట్ భూ కేటాయింపులపై కేటీఆర్ ఆరోపణలు అవాస్తవం

మొదటి పేజీ తరువాయి

**32 దరఖాస్తుల్లో టెసరాట్ ఒకటి!**

టెసరాట్ సంస్థకు భూ కేటాయింపుల్లో ఎలాంటి ప్రత్యేకత చూపలేదని శ్రీధర్‌బాబు తెలిపారు. మొత్తం 32 సంస్థలు భూముల కోసం దరఖాస్తు చేసుకోగా.. అందులో టెసరాట్ కంపెనీ కూడా ఒకటని చెప్పారు. బోర్డు నిర్ణయించిన నిబంధనలు, ధరల ప్రకారమే భూముల కేటాయింపు జరిగిందని స్పష్టం చేశారు. బోర్డు నిర్ణయించిన ధర కంటే ఒక్క రూపాయి కూడా తక్కువకు భూములు ఇవ్వలేదని పేర్కొన్నారు.

**ఎకరం రూ.1.50 కోట్లకు కేటాయింపు!**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎకరం భూమిని రూ.90 లక్షలకు కేటాయిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరం రూ.1.50 కోట్లకు కేటాయించిందని శ్రీధర్‌బాబు తెలిపారు. భూముల కేటాయింపుల్లో ప్రభుత్వం ఎలాంటి నిబంధనలను ఉల్లంఘించలేదని అన్నారు. ఐదు ఎకరాల్లో రూ.34 కోట్లతో ఏర్పాటు చేయనున్న కంపెనీని రూ.200 కోట్ల సంస్థగా కేటీఆర్ పేర్కొనడం ఆశ్చర్యంగా ఉందని విమర్శించారు.

**సీఎం సోదరులకు ఎలాంటి సంబంధం లేదు!**

టెసరాట్ సంస్థతో సీఎం రేవంత్‌రెడ్డి సోదరులకు ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చిన పోస్టులను ఆధారంగా చేసుకుని కేటీఆర్ ఆరోపణలు చేయడం సరి కాదన్నారు. మీడియా ప్రచారం కోసం నోటికొచ్చినట్లు మాట్లాడటం బాధ్యతాయుతమైన రాజకీయ నాయకుడి లక్షణం కాదని విమర్శించారు.

**బీఆర్ఎస్ హయాంలో ఎందుకు తక్కువ ధరకు భూములు ఇచ్చారు?**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముడుపులు తీసుకునే కంపెనీలకు భూములు ఇచ్చారా? అంటూ శ్రీధర్‌బాబు కేటీఆర్‌ను ప్రశ్నించారు. అప్పట్లో ఎకరం రూ.90 లక్షలకే భూములు ఎందుకు కేటాయించారో కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో లీజుకు ఇచ్చిన భూములను రెగ్యులరైజ్ చేసినప్పుడు కేటీఆర్‌కు తప్పుగా ఎందుకు అనిపించలేదని ప్రశ్నించారు.

**పరిశ్రమలు రావొద్దనే హిడెన్ అజెండా!**

రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు రావొద్దనే హిడెన్ అజెండాతోనే కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని శ్రీధర్‌బాబు విమర్శించారు. పీఎం ఏక్తామాల్ టెండర్లు కూడా పూర్తిగా పారదర్శకంగా జరిగాయని తెలిపారు. తన శాఖలో జరిగే ప్రతి నిర్ణయం తనకు తెలుసని.. ఎవరో చెప్పిన సమాచారం ఆధారంగా తాను పనిచేసే రకం కాదని స్పష్టం చేశారు.

**'బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం కలలో మాట!'**

కేటీఆర్ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని శ్రీధర్‌బాబు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగానే భూముల కేటాయింపులు చేస్తోందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ తిరిగి తెలంగాణలో అధికారంలోకి రావడం కలలో కూడా సాధ్యం కాదని మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు.

# రేవంత్ బ్రదర్స్ షెల్ కంపెనీల బాగోతం బయటపెడతాం

మొదటి పేజీ తరువాయి

సంధించారు.

**టెస్రాక్ట్‌కు చైర్మన్‌గా కొండల్‌రెడ్డి.. కేటీఆర్ ప్రశ్నల వర్షం!**

కొండల్‌రెడ్డి టెస్రాక్ట్ సంస్థకు చైర్మన్‌గా ఉన్నానని స్వయంగా చెప్పారని కేటీఆర్ పేర్కొన్నారు. అలాంటప్పుడు టెస్రాక్ట్ కంపెనీతో కొండల్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్‌బాబు ఎలా చెబుతారని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వ పెద్దలు చెబుతున్న మాటలకు, వాస్తవ పరిస్థితులకు పొంతన లేదని ఆరోపించారు.

**ఒక్క ఉద్యోగి కూడా లేని కంపెనీకి వేల కోట్ల భూములా?**

టెస్రాక్ట్ సంస్థలో ఒక్క ఉద్యోగి కూడా లేరని కేటీఆర్ ఆరోపించారు. ఉద్యోగులు, కార్యకలాపాలు లేని కంపెనీకి వేల కోట్ల విలువైన భూములను ఎలా కేటాయించారని ఆయన నిలదీశారు. భూముల కేటాయింపుల వెనుక ఉన్న విధానాలు, నిర్ణయాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**సూటు బూట్లతో కంపెనీలు ఎలా పెట్టారు?'**

రేవంత్ బ్రదర్స్ సూటు, బూట్లు వేసుకుని కంపెనీలు ఎలా ఏర్పాటు చేశారని కేటీఆర్ ప్రశ్నించారు. తక్కువ కాలంలోనే భారీ స్థాయి కంపెనీలు, వ్యాపార వ్యవహారాలు ఎలా తెరపైకి వచ్చాయో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

**షెల్ కంపెనీల బాగోతం బయటపెడతాం!**

రేవంత్‌రెడ్డి కుటుంబానికి సంబంధించినట్లు తాము ఆరోపిస్తున్న షెల్ కంపెనీల వ్యవహారాలపై త్వరలో పూర్తి వివరాలను ప్రజల ముందుంచుతామని కేటీఆర్ హెచ్చరించారు. టెస్రాక్ట్ సంస్థకు భూముల కేటాయింపు, కొండల్‌రెడ్డి పాత్ర, మంత్రి శ్రీధర్‌బాబు చేసిన వ్యాఖ్యలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ చేసిన ఈ ఆరోపణలు తెలంగాణ రాజకీయాల్లో మరోసారి తీవ్ర చర్చకు దారితీశాయి.

# పార్టీ మారడం ఇష్టం లేదు

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరాల్సి వచ్చిందని తెలిపారు. కామారెడ్డి జిల్లా బీర్కూరులో కార్యకర్తలు, అభిమానులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు.

**కేసీఆర్‌ను మోసం చేయడం నాకు ఇష్టం లేదు!**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మోసం చేసి కాంగ్రెస్‌లోకి మారడం తనకు ఎంతమాత్రం ఇష్టం లేదని పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అయితే నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు రావాలనే ఉద్దేశంతోనే పార్టీ మారాల్సి వచ్చిందని వివరించారు. తాను ఎలాంటి స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ మారలేదని స్పష్టం చేశారు. తనకు అన్నం పెట్టిన వారిని ఎప్పటికీ మర్చిపోలేనని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలోనే బాన్సువాడ నియోజకవర్గంలో గణనీయమైన అభివృద్ధి జరిగిందని పోచారం గుర్తుచేశారు.

**6 నెలల్లో బిల్లులు ఇస్తామన్నారు.. సగం నిధులే వచ్చాయి!**

కాంగ్రెస్‌లో చేరే సమయంలో బాన్సువాడ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల బిల్లులను ఆరు నెలల్లో మంజూరు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని పోచారం తెలిపారు. అయితే పార్టీ మారిన తర్వాత ఇప్పటివరకు సగం నిధులు మాత్రమే మంజూరయ్యాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో గుత్తేదారులు పనులు నిలిపివేశారని.. దీంతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**సీఎం, మంత్రులు ఫోన్ కూడా ఎత్తడం లేదు!**

నియోజకవర్గానికి రావాల్సిన నిధుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని పలుమార్లు కోరినా ఆశించిన స్థాయిలో స్పందన రాలేదని పోచారం పేర్కొన్నారు. సీఎం, మంత్రులకు ఫోన్ చేసినా స్పందించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి కూడా తన ఫోన్ కాల్స్ ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.


**'నేను నీకు అమ్ముడుపోయానా.. పదవిని కొన్నావా?'**

గతేడాది నవంబర్‌లో ఫిరాయింపు ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం నిర్వహించిన సందర్భాన్ని పోచారం శ్రీనివాస్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో తాను సీఎంను సూటిగా ప్రశ్నించానని తెలిపారు. 'నేను నీకు అమ్ముడుపోయానా.. లేక నా ఎమ్మెల్యే పదవిని కొన్నావా?' అని రేవంత్‌రెడ్డిని నిలదీసినట్లు వెల్లడించారు. తన నియోజకవర్గానికి రావాల్సిన నిధుల గురించి మాట్లాడేందుకు ప్రయత్నించినా ఆశించిన స్పందన రాలేదని తెలిపారు.

**జాతీయ జెండా భావనతోనే ముందడుగు..**

తాను కాంగ్రెస్ పార్టీ జెండా కప్పుకోలేదని.. కేవలం జాతీయ జెండా భావనతోనే ముందడుగు వేశానని పోచారం వ్యాఖ్యానించారు.

# డ్యాన్సర్స్ అసోసియేషన్ వివాదంపై జానీ మాస్టర్ కీలక వ్యాఖ్యలు



**ప్రజా వాయిస్, బ్యూరో :** తెలుగు ఫిలిం అండ్ టీవీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ (టీఎఫ్ఐడీడీఏ)లో ఇటీవల చోటుచేసుకున్న వివాదంపై ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ కీలక వ్యాఖ్యలు చేశారు. వివాదానికి దారితీసిన పరిణామాలను తెలిసీ తెలియక జరిగిన తప్పిదాలుగా భావించి పెద్ద మనసుతో మన్నించాలని సినీ పరిశ్రమను కోరారు. ఫిలిం ఛాంబర్, ఫెడరేషన్‌తో ఉన్న వివాదం ప్రస్తుతం సమసిపోయిందని తెలిపారు.

**'అందరి సహకారం కావాలి'**

చిత్ర పరిశ్రమలోని అన్ని విభాగాలు టీఎఫ్ఐడీడీఏకు సహాయ సహకారాలు అందించాలని జానీ మాస్టర్ విజ్ఞప్తి చేశారు. తండ్రి కోప్పడినా చివరికి మళ్లీ దగ్గరకు తీసుకుంటాడని.. అదే విధంగా డ్యాన్సర్స్ అసోసియేషన్‌ను కూడా ప్రోత్సహించాలని కోరారు. పరిశ్రమలో అందరితో సామరస్యపూర్వకంగా వ్యవహరిస్తూ ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.

**'డ్యాన్సర్లకు డబ్బు పూర్తిగా అందడం లేదన్నదే నా ఆవేదన'**

డ్యాన్సర్లకు నిర్మాతలు ఇచ్చే పారితోషికం పూర్తిగా వారికి అందడం లేదన్నదే తన ప్రధాన ఆవేదన అని జానీ మాస్టర్ తెలిపారు. ఆ సమస్య గురించే తాను మాట్లాడానని వివరించారు. తన అభిప్రాయాన్ని చిరంజీవితో పాటు చిత్ర పరిశ్రమలోని ఇతర పెద్దలు అర్థం చేసుకున్నారని చెప్పారు. సమస్యను అందరితో చర్చించి సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని వారు సూచించారని తెలిపారు.

**'నేనేమైనా తప్పు మాట్లాడితే క్షమించండి'**

పరిశ్రమ పెద్దల సూచనలకు అనుగుణంగానే తాము ముందుకు వెళ్తామని జానీ మాస్టర్ స్పష్టం చేశారు. తన వ్యాఖ్యల వల్ల ఎవరైనా ఇబ్బందిపడి ఉంటే క్షమించాలని కోరారు. తెలిసీ తెలియక జరిగిన తప్పిదాలను పెద్ద మనసుతో మన్నించాలని సినీ పరిశ్రమకు విజ్ఞప్తి చేశారు.

**ఉప ఎన్నికల్లో గెలిచిన సభ్యుల ప్రమాణ స్వీకారం**

టీఎఫ్ఐడీడీఏ ఉప ఎన్నికల్లో విజయం సాధించిన సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో జానీ మాస్టర్ ఈ వ్యాఖ్యలు చేశారు. కార్యక్రమానికి పీపుల్స్ మీడియా అధినేత టి.జి. విశ్వప్రసాద్ హాజరయ్యారు. ఇటీవల నెలకొన్న వివాదాలకు ముగింపు పలికి, పరిశ్రమలోని అన్ని వర్గాలతో కలిసి పనిచేస్తామని జానీ మాస్టర్ వ్యాఖ్యల ద్వారా స్పష్టం చేశారు.

# సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**ప్రజా వాయిస్, సంగారెడ్డి బ్యూరో :** సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మొగడంపల్లి మండలం సత్వార్ గ్రామ శివారులో నేషనల్ హైవే-65పై కూలీలతో వెళ్తున్న ఆటోను వేగంగా వచ్చిన ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతులు కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లా రాజగిరి ప్రాంతానికి చెందిన వ్యవసాయ కూలీలుగా పోలీసులు గుర్తించారు.

**యూటర్న్ వద్ద ఆటోను ఢీకొట్టిన ట్యాంకర్!**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్వార్ గ్రామ శివారులో హైవేపై యూటర్న్ సమీపంలో కూలీలతో వెళ్తున్న ఆటోను ఆయిల్ ట్యాంకర్ బలంగా ఢీకొట్టింది. హైదరాబాద్ వైపు నుంచి కర్ణాటక వైపు వెళ్తున్న ట్యాంకర్.. ఆటోను వెనుక నుంచి ఢీకొట్టినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ప్రమాద తీవ్రతకు ఆటో నుజ్జునుజ్జయింది. అందులో ఉన్న కూలీలు రోడ్డుపై ఎగిరిపడ్డారు. ఈ ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

**మృతుల్లో ఆరుగురు మహిళలు.. ఒక పురుషుడు!**

ప్రమాదంలో మృతి చెందిన వారిలో ఆరుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ప్రమాద సమయంలో ఆటోలో మొత్తం 14 మంది కూలీలు ఉన్నట్లు సమాచారం. వ్యవసాయ పనుల కోసం జహీరాబాద్, పరిసర ప్రాంతాలకు వచ్చిన వీరు.. మంగళవారం పనులు ముగించుకుని ఆటోలో తమ స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా ఈ విషాదం చోటుచేసుకుంది.

**బీదర్ జిల్లా వాసులుగా గుర్తింపు!**

మృతులు, క్షతగాత్రులు కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లా రాజగిరి ప్రాంతానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. వీరు నిత్యం వ్యవసాయ కూలి పనుల కోసం జహీరాబాద్ పరిసర ప్రాంతాలకు వచ్చి వెళ్తుంటారని స్థానికులు తెలిపారు. రోజువారీ పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తుండగా ప్రమాదం జరగడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

**గాయపడిన వారి పరిస్థితి విషమం!**

ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన ఐదుగురిని జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**ఎన్‌హెచ్-65పై మరో ప్రమాదం.. ఇద్దరి మృతి!**

ఇదే సమయంలో సంగారెడ్డి జిల్లాలోని ఎన్‌హెచ్-65పై మరో ఘోర ప్రమాదం జరిగింది. కోహీర్ మండలం వెంకటాపూర్ వద్ద డివైడర్‌ను ఢీకొన్న కారు అవతలి వైపునకు ఎగిరి పడింది. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న నాలుగు వాహనాలను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు మృతి చెందారు.

**ప్రమాదాలపై పోలీసుల దర్యాప్తు!**

కూలీల ఆటో ప్రమాదంతో ఎన్‌హెచ్-65పై కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు వెంటనే ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి వాహనాలను పంపించారు. ఘటనపై కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలు, ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యంపై దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతులు కర్ణాటకకు చెందినవారు కావడంతో వారి కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు.

# ఆర్ఎంపీ వైద్యం వికటించి 8వ తరగతి విద్యార్థిని మృతి



**ప్రజా వాయిస్, బ్యూరో :** ఆర్ఎంపీ వైద్యం వికటించడంతో 8వ తరగతి చదువుతున్న ఓ బాలిక మృతి చెందిన విషాద ఘటన ఖమ్మం జిల్లాలో చోటుచేసుకుంది. బోనాల పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపిన చిన్నారి.. అనారోగ్యానికి గురై ఆర్ఎంపీ వద్ద చికిత్స తీసుకున్న అనంతరం ప్రాణాలు కోల్పోయింది. కళ్లముందే ఆడిపాడిన కుమార్తె విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనతో బస్వాపురం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

**హేమశ్రీకి స్వల్ప అస్వస్థత.. ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లిన తల్లిదండ్రులు!**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం బస్వాపురానికి చెందిన చల్లా హేమశ్రీ (14) స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో 8వ తరగతి చదువుతోంది. బోనాల పండుగ సందర్భంగా హేమశ్రీ ఇంటికి వచ్చింది. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడిపింది. తిరిగి హాస్టల్‌కు పంపించేందుకు సిద్ధమవుతున్న సమయంలో బాలిక స్వల్పంగా అనారోగ్యానికి గురైంది. దీంతో తల్లిదండ్రులు ఆమెను స్థానికంగా వైద్యం చేస్తున్న ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు.

**ఇంజెక్షన్ ఇస్తుండగా స్పృహ కోల్పోయిన బాలిక!**

హేమశ్రీని పరీక్షించిన ఆర్ఎంపీ వైద్యుడు ఓ ఇంజెక్షన్ ఇచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం మరో ఇంజెక్షన్ ఇస్తున్న సమయంలో బాలిక ఒక్కసారిగా స్పృహ కోల్పోయింది. నోటి నుంచి నురగ రావడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వెంటనే హేమశ్రీని ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే బాలిక మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు.

**కళ్లముందే కుమార్తె మృతి.. తల్లిదండ్రుల కన్నీరుమున్నీరు!**

కొద్దిసేపటి క్రితమే తమతో కలిసి ఆనందంగా గడిపిన కుమార్తె అకస్మాత్తుగా మృతి చెందడంతో హేమశ్రీ తల్లిదండ్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. చిన్నారి మృతితో బస్వాపురం గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

**ఆర్ఎంపీ మద్యం సేవించి ఉన్నాడని ఆరోపణలు!**

వైద్యం చేసే సమయంలో ఆర్ఎంపీ మద్యం సేవించి ఉన్నాడని హేమశ్రీ కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆర్ఎంపీ నిర్లక్ష్యం కారణంగానే తమ కుమార్తె ప్రాణాలు కోల్పోయిందని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఈ ఆరోపణలపై దర్యాప్తు అనంతరం వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

**పరారీలో ఆర్ఎంపీ.. పోలీసుల గాలింపు!**

బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటన అనంతరం ఆర్ఎంపీ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాలిక మృతికి అసలు కారణాలను నిర్ధారించేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనంగా మారింది. బాలిక మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సామాజిక మాధ్యమాల్లో పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# ఎల్బీనగర్ షాపుల కేటాయింపులపై రాజకీయ దుమారం

- ఎమ్మెల్యే అనుచరులకు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు
- పేరు లేని ఫ్లెక్సీల వెనుక దాగి ఉన్న అసమర్ధతకు నిదర్శనమా?
- అర్హులకు న్యాయం జరిగే వరకు సీపీఐ పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తాం!
- సీపీఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య




**ప్రజా వాయిస్ గోదావరిఖని** రామగుండం కార్పొరేషన్ పరిధిలోని ఎల్బీనగర్ జంక్షన్‌లో నిర్మిస్తున్న నూతన షాపుల కేటాయింపు వ్యవహారం రాజకీయ దుమారాన్ని రేపుతోంది. గతంలో అక్కడ వ్యాపారం చేసు కుంటున్న చిరు వ్యాపారులకు ఈ షాపులను కేటాయించకుండా, ఎమ్మెల్యే అనుచరులకు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నా యని సీపీఐ ఆరోపిస్తోంది. ఈ మేరకు ఎల్బీనగర్ జంక్షన్‌లో వెలిసిన ఓ ఫ్లెక్సీ ఇప్పుడు చర్చనీయాం శంగా మారింది. ఆ ఫ్లెక్సీలో, ఎమ్మెల్యే మఖాన్ సింగ్ రాజ్ ఠాకూర్ గారికి అడ్వాన్స్ హ్యాపీ బర్త్డే తెలుపుతూ, ఎల్బి నగర్ జంక్షన్ అసలు చిరు వ్యాపారులు అని ఉంది. అయితే, ఈ ఫ్లెక్సీలో వ్యాపారుల పేర్లు, ఫోటోలు ఏవీ లేవు. దీనిపై సీపీఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నిన్నటి వరకు ఆరుగురు చిరు వ్యాపారులకు షాపులు కేటాయి స్తామని ఎమ్మెల్యే చెప్పారు. కానీ, కనీసం వారి పేర్లు కూడా ప్రకటించలేకపోవడం వెనుక ఏ రకమైన రాజకీయం నడుస్తోంది?" అని సూర్య ప్రశ్నించారు. పేర్లు లేని ఫ్లెక్సీలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు మానుకోవాలి. గతంలో అక్కడ వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారు లకు షాపులు కేటాయిస్తామని ఎమ్మెల్యే గతంలోనే హామీ ఇచ్చారని, కానీ ఇప్పుడు ఆ హామీని నీరుగార్చేలా వ్యవహరిస్తున్నారని సూర్య ఆరోపించారు. అర్హులైన చిరు వ్యాపారులకు న్యాయం జరిగే వరకు సీపీఐ పోరాటాన్ని ఉధృతం చేస్తుంది. అని స్పష్టం చేశారు.

# గురుకుల నీళ్లు కాదు.. - రోడ్డెక్కిన విష వ్యర్థాలు!

- రావుల చెరువు కలుషితం..
- నిద్రమత్తులో మంథని మున్సిపాలిటీ!

**ప్రజా వాయిస్ మంథని** అది విద్యాబుద్ధులు నేర్పించే గురుకుల పాఠశాల ప్రాంగణం.. కానీ అక్కడి నుంచి బయటకు వస్తున్నది మాత్రం విషతుల్యమైన కలుషిత నీరు! పెద్దపల్లి జిల్లా మంథని మున్సి పాలిటీ పరిధిలోని పోచమ్మ వాడలో పరిస్థితి నరకానికి నమూనాగా మారింది. స్థానిక ప్రభుత్వ గురుకుల పాఠశాల/ కళాశాల నుండి నిత్యం మురుగు నీరు, వాడిన వ్యర్థాలు నేరుగా రహదారిపైకి ప్రవహి స్తున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమై, కాల్వలంటూ లేకపోవ డంతో ఆ మురుగు నీరంతా రోడ్డుపైనే పచ్చటి నాచు పట్టి, దుర్గంధంతో ప్రవహిస్తూ అంటురోగాలకు నిలయంగా మారింది.





**కాలుష్య కాసారంగా 'రావుల చెరువు'..**
**రోడ్డున పడ్డ రైతు బతుకులు!**

గురుకులం నుండి రోడ్డెక్కిన ఈ కలుషిత మురుగు నీరు నేరుగా పక్కనే ఉన్న సాగునీటి ఆధారం 'రావుల చెరువు'లోకి చేరుతోంది. ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో కళకళలాడిన చెరువు, ఇప్పుడు గురుకుల వ్యర్థాలతో నల్లగా, పచ్చగా మారి పూడిపోతోంది. ఆ కలుషిత నీరే కాల్వల ద్వారా పక్కనే ఉన్న రైతు పొలాల్లోకి చేరుతుండటంతో చేను ఆకు పడిపోవడం, పంటలు దెబ్బతినడం జరుగుతోంది. రసాయన వ్యర్థాల వల్ల నేల సారం కోల్పోయి ఏడాదంతా కష్టపడి పండించిన పంట చేతికి రాకుండా పోతోందని రైతులు కంటనీరు పెట్టుకుంటు న్నారు.

**సంబంధిత అధికారులు నిద్రిస్తున్నారా?**
**నిద్ర నటిస్తున్నారా?**

రోజూ ఇదే మార్గంలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, విద్యాశాఖ అధికారులు వెళ్తున్నా కంటికి కనిపిస్తున్న ఈ తీవ్ర సమస్యపై కనీసం దృష్టి సారించకపోవడం గమనార్హం. అసలు అధి కారులు నిద్రపోతున్నారా? లేక మురుగునీటి నిర్వహణకు నిధులు వాడుకుంటూ సమస్య తెలిసీ నిద్ర నటిస్తున్నారా? అని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ఆవరణలోనే పెద్ద ఎత్తున మురుగు నీరు, బురద గుంటలు ఏర్పడి విద్యార్థుల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతున్నా విద్యాశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరి స్తోంది.

**ఆందోళనకు సిద్ధమైన బాధితులు!**

రహదారి పొడవునా పారే మురుగు నీరు, చేరిన మట్టి దిబ్బలు, నాచు పట్టిన గుంటలతో పోచమ్మ వాడ వాసులు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్, కలెక్టర్ తక్షణమే స్పందించి గురుకుల పాఠశాల మురుగునీటికి శాశ్వత డ్రైనేజీ మార్గాన్ని ఏర్పాటు చేయాలని, రావుల చెరువు కలుషితం కాకుండా కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యం వీడ కపోతే మున్సిపల్ ఆఫీస్ మరియు గురుకుల పాఠశాల ముందు పెద్ద ఎత్తున ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరిస్తున్నారు.



# సంక్షేమ ఆశ్రమాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజా వాయిస్ సుల్తానాబాద్** పెద్దపల్లి జిల్లాలోని సంక్షేమ సంస్థల్లో వసతి పొందుతున్న చిన్నారులు, వృద్ధులకు అత్యుత్తమ సంరక్షణ, భద్రత కల్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం సుల్తానాబాద్‌లోని దివ్యాంగుల పాఠశాల, వృద్ధాశ్రమం, బాల సదనం, ఎంఆర్సీ కేంద్రాలతో పాటు పెద్దపల్లిలోని బాల రక్షక భవన్, భరోసా కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమాల్లోని వసతి సౌకర్యాలు, వంటశాలల్లో ఆహార నాణ్యత, పరిశుభ్రతను పరి శీలించి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.


# ఆసుపత్రి పెద్దది.. సౌకర్యాలు చిన్నవి!

- ఓపీ నమోదు కోసం ఎండలోనే రోగుల నిరీక్షణ
- జిల్లా స్థాయి ఆసుపత్రిలో కనీస నీడ సౌకర్యం కరువు
- వందల కోట్ల వైద్య సదుపాయాలు.. రోగులకు మాత్రం అవస్థలు
- నిర్లక్ష్యానికి బాధ్యులెవరు?
- వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహణ లోపంపై ప్రజల ప్రశ్నలు

**ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:** వికారాబాద్‌లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి జిల్లాలోనే ప్రధాన ప్రభుత్వ వైద్య కేంద్రంగా కొనసాగుతోంది. నిత్యం వందలాది మంది రోగులు వైద్యం కోసం ఆసుప త్రికి వస్తుంటారు. అయితే ఇంత పెద్ద ఆసుపత్రిలో అవుట్ పేషంట్ (ఓపీ) నమోదు చేసుకోవడానికి వచ్చే రోగులు ఎండలో నిలబడాల్సిన దుస్థితి నెలకొనడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.ఓపీ నమోదు కోసం ఎండలో క్యూలుఉదయం నుంచే ఆసుపత్రికి చేరుకునే రోగులు, వారి సహాయకులు ఓపీ పేరు నమోదు కోసం క్యూలో నిలబడుతున్నారు. అయితే రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద తగినంత నీడ, క్యూలైన్‌కు అనుకూలమైన షెడ్డు వంటి కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఎండలోనే వేచి ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు.అనారో గ్యంతో వచ్చిన రోగులకు గంటల తరబడి ఎండలో నిలబడే పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది.

**నిర్లక్ష్యానికి బాధ్యులు ఎవరు?**

రోగుల ఇబ్బందులు అధికారుల దృష్టికి వచ్చినప్పటికీ పరిష్కారం కనిపించకపోతే దానికి బాధ్యత ఎవరిది?ప్ర తిరోజూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరిం చేందుకు ఆసుపత్రి యాజమాన్యం, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.వెంటనే షెడ్.. మెరుగైన క్యూలైన్ ఏర్పాటు చేయా లిఓపీ రిజిస్ట్రేషన్ ప్రాంతంలో విశాలమైన షెడ్, కూర్చునే సౌకర్యం, క్రమబద్ధమైన క్యూలైన్ కల్పించాలని రోగులు కోరుతున్నారు.ఆసుపత్రి పెద్దదిగా ఉండటం మాత్రమే కాదు.. అక్కడికి వచ్చే రోగులకు సౌకర్యంగా సేవలు అందుతున్నాయా?" అనే ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది.






# సింగరేణి రైలు ద్వారా తరలింపు పీడీఎస్ బియ్యం పట్టివేత

**ప్రజా వాయిస్. సిర్పూర్ టి.**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టౌన్ రైల్వే స్టేషన్ లోవిశ్వసనీయ సమాచారం మేరకు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీరామ్ మీనా. మరియు రాజ్‌కుమార్ డి టి ఎన్‌ఫోర్స్‌మెంట్. ,ఆర్.దాసు ఏ యస్ ఐ.ల సంయుక్త బృందం సిర్పూర్-టి రైల్వే స్టేషన్‌లో , సింగరేణి రైలు నందు తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో 35 బస్తాలలో నింపిన సుమారు 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడింది. తనిఖీల సమయంలో సంబంధిత వ్యక్తులు బియ్యాన్ని వదిలి పరారయ్యారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసి, సంబంధిత వ్యక్తులను గుర్తించేందుకు విచారణ చేపట్టారు.ప్రభుత్వ రాయితీ పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించడం, నిల్వ చేయడం లేదా దుర్వినియోగం చేయడం చట్టరీత్యా నేరం. ఇటువంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయి.

# ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా భైరబోయిన శంకర్

- పార్టీ బలోపేతానికి, ఓబీసీ హక్కుల సాధనకు కృషి చేస్తా



**ప్రజా వాయిస్ /నల్గొండ క్రైమ్:** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నల్గొండ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా భైరబోయిన శంకర్ నియమితులయ్యారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన పార్టీ నాయ కత్వానికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞ తలు తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జునసాగర్ నియోజక వర్గ ఇన్‌చార్జి కంకణాల నివేదిత రెడ్డి, శ్రీధర్ రెడ్డిలకు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్ ముదిరాజ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గండమల్ల ఆనంద్ గౌడ్, జిల్లా ఇన్‌చార్జి ఉదయ్ ప్రతాప్‌లకు భైరబో యిన శంకర్ ప్రత్యేక ధ న్యవాదాలు తెలిపారు.పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవం తంగా నిర్వహిస్తూ బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఓబీసీ కులాల హక్కుల సాధనతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజా సేవకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# యూజీడీ పనులతో.. ప్రజలకు ఇక్కట్లు

- నాణ్యత లేని పనులు నిలిపివేయాలి
- డిఫాల్టర్ కాంట్రాక్టర్‌ను మార్చాలి
- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

**ప్రజా వాయిస్,కోదాడ:** పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఆరోపించారు. మంగళ వారం 22వ వార్డులో గుంతలమయమైన రోడ్లు, నిలిచిన వర్షపు నీటిని పరిశీలించారు. పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా జరగడం లేదని, గుంతల్లో నీరు నిలిచి పారిశుద్ధ్య సమస్య లు తలెత్తుతున్నాయని అన్నారు.యూజీడీ పనుల కోసం తవ్విన రోడ్లను నెలల తరబడి పునరుద్ధరిం చకపోవడంతో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. విద్యుత్, మిషన్ భగీరథ పైపులు దెబ్బతినడంతో మరిన్ని సమ స్యలు వస్తున్నాయన్నారు. కమిషన్లపై ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యలపై లేదంటూ మంత్రి దంపతులపై విమర్శలు చేశారు. కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని పనులను సక్రమంగా చేపట్టించాలని డిమాండ్ చేశారు. డిఫాల్టర్ కాంట్రాక్టర్ ను తప్పించి, నాణ్యతతో పనులు చేసే మరో కాంట్రా క్టర్‌కు బాధ్యతలు అప్పగించాలని కోరారు. ప్రభు త్వం స్పందించకపోతే న్యాయపోరాటంతో పాటు ప్రత్యక్ష ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



# 200 మీటర్ల భారీ త్రివర్ణ పతాకంతో ఘనంగా తిరంగా ర్యాలీ

- ఉత్సాహంగా పాల్గొన్న 2 వేల మంది విద్యార్థులు
- భారీ జాతీయ జెండాతో పట్టణ ప్రధాన వీధుల్లో ప్రదర్శన
- దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత
- బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవరెడ్డి



**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :** హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ సుల్తానాబాద్ మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. హర్ ఘర్ తిరంగా కన్వీనర్ ఉషణ అన్వేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో సుమారు 2 వేల మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.సుమారు 200 మీటర్ల పొడవైన భారీ త్రివర్ణ పతాకాన్ని విద్యార్థులు చేతబట్టి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థుల దేశభక్తి నినాదాలతో పట్టణం మార్మోగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవరెడ్డి, రాష్ట్ర నాయకులు గొట్టిముక్కల సురేష్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు మీసా అర్జున్‌రావు హాజర య్యారు. ఈ సందర్భంగా కర్రే సంజీవరెడ్డి మాట్లాడుతూ జాతీయ జెండా భారతదేశ సార్వభౌమత్వం, ఐక్యత, త్యాగాలకు ప్రతీక అని అన్నారు. ప్రతి ఒక్కరిలో దేశభక్తి భావాన్ని పెంపొందించడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులని, దేశ ఐక్యత, సమగ్రతను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్ మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ర్యాలీని విజయవంతం చేయడం సంతోషంగా ఉందన్నారు.ఈ కార్య క్రమంలో వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినీ విద్యార్థులతో పాటు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సొదరి మహేందర్ యాదవ్, కాసాగోని నిర్మల, కందునూరి కుమార్, ఎండీ రఫీక్, మిట్టపల్లి ప్రవీణ్‌కుమార్, కొల్లూరి సంతోష్‌కుమార్, కోట నాగేశ్వర్, కొమ్మిడి రాజేందర్‌రెడ్డి, మల్క భాగ్యలక్ష్మి, బండారి లత, పుచ్చకాయల హను మంతరెడ్డి, రాజన్న పటేల్, ఎల్లెంకి రాజన్న, గుడ్ల వెంకటేష్, వలస సాయి, ఎర్రం సంతోష్‌రెడ్డి, వీరగోని కిరణ్, వెంకటేష్ దాసరి, పొన్న శ్రీనివాస్, ఈర్ల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో కారోబార్ కృష్ణ మృతి బాధాకరం

- చిన్నారిని ఎత్తుకుని కంటతడి పెట్టిన పద్మాదేవేందర్‌రెడ్డి.
- అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించిన మాజీ డిప్యూటీ స్పీకర్.

**ప్రజా వాయిస్, పాపన్నపేట** పాపన్నపేట గ్రామపంచాయతీ కారోబారుగా విధులు నిర్వహిస్తున్న ఆకుల కృష్ణ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం బాధాకరమని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో కృష్ణ మృతిచెందారు. విషయం తెలుసుకున్న పద్మాదేవేందర్‌రెడ్డి మంగళవారం పాపన్నపేటకు చేరుకుని కృష్ణ అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు.అనంతరం కృష్ణ భార్య, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కృష్ణకు తొమ్మిది నెలల చిన్నారి ఉండటాన్ని చూసి పద్మాదేవేందర్‌రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. చిన్నారిని ఎత్తుకుని కంటతడి పెట్టారు. కృష్ణ సోదరులు ఆకుల శ్రీనివాస్, ఆకుల భాస్కర్‌లను ఓదార్చి ధైర్యం చెప్పారు. అంత్యక్రియలు పూర్తయ్యే వరకు అక్కడే ఉండి కుటుంబ సభ్యులకు అండగా నిలిచారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తొమ్మిది నెలల చిన్నారిని చూసి తన మనసు కలచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణ కుటుంబానికి ఈ విషాదాన్ని తట్టుకునే శక్తి, మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు.వీరి వెంట పార్టీ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు గురుమూర్తి గౌడ్, లింగారెడ్డి, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు తాడేపు సోములు, నాయకులు కాశీనాథ్‌రావు, ఉప్పరి వెంకటేశం, రంగంపేట శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# 2 కోట్ల విలువైన సర్కారు భూమి స్వాహా!

- ఖమ్మంపల్లిలో 10 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా
- గుట్టలు మాయం చేస్తూ, మట్టి విక్రయాలు
- కబ్జా భూముల్లో లెవలింగ్!
- అధికారుల నిర్లక్ష్యంపై మంథని రెవెన్యూ డివిజన్ అధికారికి పర్యవేక్షణ శూన్యం



అధికారుల మౌనం వెనుక లంచాల చేతివాటమేనా?

**ప్రజా వాయిస్ ముత్తారం (మంథని)** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలో రెండు కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామ శివారులోని సర్వే సంఖ్య 617 లో ఉన్న 10 ఎకరాల వాణిజ్య ప్రాధాన్యత కలిగిన ప్రభుత్వ భూమిని కొంతమంది వ్యక్తులు అక్రమంగా కబ్జా చేశారంటూ ఖమ్మంపల్లి మాజీ సర్పంచ్ సముద్రాల రమేష్ మంథని రెవెన్యూ డివిజన్ అధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యంగా మిగిలింది.

**గుట్టలు మాయం..**
**విచ్చలవిడిగా మట్టి విక్రయాలు!**

మరోవైపు ఆక్రమణదారులు ఇక్కడ ఉన్న గుట్టలను మాయం చేస్తూ, విచ్చలవిడిగా ప్రభుత్వ భూముల్లోని మట్టిని విక్రయిస్తున్నారు. అలా అమ్మిన మట్టితోనే ఈ కబ్జా భూములను సమాను (లేవలింగ్) చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రధానంగా అడవి శ్రీరాంపూర్ నుండి ఖమ్మంపల్లి వచ్చే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న విలువైన భూములే లక్ష్యంగా ఈ కబ్జా పర్వం సాగుతుండటం గమనార్హం. ప్రస్తుతం ఇక్కడ ఎకరానికి సుమారు ₹15 లక్షల నుండి ₹20 లక్షల వరకు ధర పలుకుతుండటంతో కబ్జాకోరుల కన్ను ఈ సర్కారు భూమిపై పడింది.

ఈ అక్రమాల వ్యవహారం తహశీల్దార్‌తో పాటు జిల్లా స్థాయి అధికారుల వరకు తెలిసినప్పటికీ, వారి నుండి ఎలాంటి స్పందన కరువవ్వడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లంచాలకు ఆశపడే అధికారులు ఈ అక్రమాలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారా అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. తాను బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ఈ భూమి ఆక్రమణకు గురికాకుండా చూడాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తహశీల్దార్‌కు, రెవెన్యూ తనిఖీ అధికారి నరేన్‌కు పలుమార్లు దూరవాణి ద్వారా, నేరుగా కలిసి విజ్ఞప్తి చేసినట్లు మాజీ సర్పంచ్ తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ విలువైన ఆస్తి కబ్జాదారుల చేతుల్లోకి వెళ్ళిందని, కబ్జాకు సహకరించిన రెవెన్యూ తనిఖీ అధికారి నరేన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి. వెంటనే ఈ ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపి భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. భూమి చుట్టూ ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు, సరిహద్దులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## ఉపసర్పంచ్‌ల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉప్పుతల మహేష్

- ఏకగ్రీవంగా నియామకం
- బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తా
- ఉపసర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా ఉప్పుతల మహేష్



**ప్రజా వాయిస్,మిర్యాలగూడ.**ఉపసర్పంచ్‌ల ఫోరం నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మిర్యాలగూడ మండలం అవంతిపురం గ్రామ ఉపసర్పంచ్ ఉప్పుతల మహేష్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఉపసర్పంచ్‌ల ఫోరం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు గాదె రాజశేఖర్‌రెడ్డి ప్రతిపాదన మేరకు రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ మహేష్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ జిల్లాలోని ఉపసర్పంచ్‌ల సమస్యలను ఎప్పటికప్పుడు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఉపసర్పంచ్‌లకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు, వారికి రావాల్సిన హక్కులు, గౌరవాన్ని సాధించేందుకు ఫోరం తరపున నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.



## జగ్గారెడ్డి ఫ్రస్ట్రేషన్‌లో మాట్లాడుతున్నారు

**- ఎమ్మెల్యే చింత ప్రభాకర్**

**ప్రజా వాయిస్,సంగారెడ్డి :** రాహుల్ గాంధీ కాదు కదా... స్వయంగా సోనియా గాంధీ వచ్చి ప్రచారం చేసిన జగ్గారెడ్డి సంగారెడ్డిలో గెలవడు అనీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆరోపించారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మీడియా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ జగ్గారెడ్డి ఫ్రస్ట్రేషన్‌లో మాట్లాడుతున్నారని, అబద్ధాలు చెప్పడంలో ఆయనకు ఆస్కార్ అవార్డు ఇచ్చినా తక్కువేనని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల క్రితం జరిగిన ఓ సమావేశం గురించి ఇప్పటికీ పదేపదే చెప్పుకోవడం జగ్గారెడ్డి రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని చింత ప్రభాకర్ అన్నారు. ''చచ్చిన బర్రె పది తూముల పాలు ఇచ్చినట్లు గతంలో జరిగిన విషయాలను పదేపదే చెప్పుకోవడం మానుకోవాలి'' అని విమర్శించారు. రాహుల్ గాంధీ సభ కోసం రూ.6.5 కోట్లు అప్పు తెచ్చానని జగ్గారెడ్డి చెబుతున్నారని, తాను ఎన్ని కోట్లు అప్పులు తెచ్చానన్నది సంగారెడ్డి ప్రజలకు ఎందుకు సంబంధమని ప్రశ్నించారు. పార్టీ పెద్దల మెప్పు పొందేందుకే అప్పుల కథలు చెబుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి సంగారెడ్డి కు వచ్చిన సమయంలో ప్రభుత్వ హోదా లేని జగ్గారెడ్డికి, ఆయన భార్యకు సీఎం వేదికపై చోటు దక్కకపోవడంతో ఏర్పడిన అసంతృప్తిని హరీష్ రావుపై విమర్శల రూపంలో వ్యక్తం చేస్తున్నారని చింత ప్రభాకర్ అన్నారు.పాస్‌పోర్ట్ కేసుపై చింత ప్రభాకర్ వ్యాఖ్యలు పాస్‌పోర్ట్ బ్రోకర్ కేసులో హరీష్ రావుకు ఎలాంటి సంబంధం లేదని చింత ప్రభాకర్ స్పష్టం చేశారు. మానవ అక్రమ రవాణా కేసు దర్యాప్తులో ఆధారాలు లభించడంతో చట్టపరమైన ప్రక్రియలో భాగంగానే కేసు నమోదైందని పేర్కొన్నారు. తనపై వచ్చిన ఆరోపణలను ఇతరులపైకి నెట్టే ప్రయత్నం చేయవద్దని జగ్గారెడ్డికి సూచించారు. సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా జగ్గారెడ్డి ఉన్న సమయంలో అవినీతి జరిగిందని, పలువురు అధికారులు సస్పెండ్ అయ్యారని, కొందరు జైలుకు వెళ్లారని చింత ప్రభాకర్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో తన నిజాయితీ, పోలీసుల విచారణ గురించి జగ్గారెడ్డి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. సంగారెడ్డి మెడికల్ కాలేజీ విషయంలో కూడా జగ్గారెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని చింత ప్రభాకర్ విమర్శించారు. కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే తాను ఫైల్ పెట్టానని జగ్గారెడ్డి చెబుతున్నారని, అలాంటప్పుడు అప్పుడే ఎందుకు మెడికల్ కాలేజీ తీసుకురాలేకపోయారని ప్రశ్నించారు. 2018 ఎన్నికల ప్రచార సభలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు, మాజీ మంత్రి హరీష్ రావు సహకారంతో సంగారెడ్డికి మెడికల్ కాలేజీ మంజూరై, ప్రారంభమైందని చింత ప్రభాకర్ తెలిపారు. కళ్లముందు ఉన్న అభివృద్ధిని కూడా తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తే ప్రజలు నవ్వుకుంటారని అన్నారు.తెలంగాణ ఉద్యమంపై తీవ్ర విమర్శలు తెలంగాణ ఉద్యమ సమయంలో జగ్గారెడ్డి వైఖరిని కూడా చింత ప్రభాకర్ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో సమైక్యవాదానికి మద్దతుగా నిలిచిన వ్యక్తి ఇప్పుడు తెలంగాణ అభివృద్ధి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కేసీఆర్, హరీష్ రావు తెలంగాణ కోసం పోరాడుతుంటే జగ్గారెడ్డి అందుకు భిన్నంగా వ్యవహరించారని ఆరోపించారు.2018లో కేసు నేపథ్యంలో జైలు నుంచి వచ్చిన తర్వాత ప్రజలను కలిసి క్షమాపణలు కోరుతూ తిరిగారని, ప్రజలు జాలితో అవకాశం ఇచ్చారని చింత ప్రభాకర్ అన్నారు. అయితే ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత సంగారెడ్డి అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు.తాను 2018లో ఎమ్మెల్యేగా ఓడిపోయినప్పటికీ ప్రజల మధ్యే ఉంటూ సేవ చేశానని, కేసీఆర్, హరీష్ రావు సహకారంతో సంగారెడ్డిలో వందల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. సంగారెడ్డి ప్రజలకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉన్నానన్నారు. 2023 ఎన్నికల్లో ప్రజలు జగ్గారెడ్డి రాజకీయాలను తిరస్కరించి తనకు అవకాశం ఇచ్చారని చింత ప్రభాకర్ అన్నారు. రాబోయే ఐదేళ్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని చెప్పారు. చిల్లర రాజకీయాలు, ప్రతీకార రాజకీయాలు తమకు అవసరం లేదన్నారు.




## కొత్తగూడెం ఎమ్మెల్యే డిపిఆర్ టెండర్ రద్దు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి

- 8కోట్ల స్కాంలో సూత్రధారులు ఎవరు..!!
- ఎంతటి వారైనా విడిచి పెట్టే ప్రసక్తే లేదు
- మున్సిపల్ అధికారులపై పిర్యాదు చేస్తాం
- జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్

**ప్రజా వాయిస్ కొత్తగూడెం** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ లో నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి పారదర్శకత లేకుండా నిర్వహించిన రూ.9 కోట్ల 60 లక్షల డిపిఆర్ టెండర్ ప్రక్రియను తక్షణమే రద్దు చేసి ఎమ్మెల్యే కూనంనేనీ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని జైభీమ్ రావు భారత్ పార్టీ.జేబీపీ, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ భద్రాద్రి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట డిమాండ్ చేశారు.మంగళవారం జేబీపీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు జరిగిన నిరసన కార్యక్రమంలో యెర్రా కామేష్ మాట్లాడుతూ కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనుల కోసం డిపిఆర్ లో 9 కోట్ల 60 లక్షల విలువచేసే టెండర్ ను కేవలం మూడు రోజులు మాత్రమే సమయం కేటాయించి మూడు రోజుల్లోనే టెండర్ ఓపెన్ చేయడం పూర్తిగా నిబంధనలకు వ్యతిరేకమని కేవలం రెండు దరఖాస్తులు మాత్రమే వచ్చినప్పుడు వాటిని రద్దు చేసి మరల టెండర్ నిర్వహించాలని,కానీ అలా చేయకుండా మున్సిపల్ అధికారులు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా టెండర్ ఓపెన్ చేశారని,నిబంధనలను తుంగలో త్రొక్కి టెండర్ ఓపెన్ చేసిన అధికారులపై ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.9కోట్ల 60 లక్షల పనికి కనీసం 14 రోజుల గడువు ఇవ్వాలనే ఈ ప్రొక్యూర్మెంట్ నిబంధనలు ఉన్నాయని అన్నారు. టెండర్ ప్రక్రియలో 8కోట్ల స్కామ్ జరిగే అవకాశం ఉందని అసలు 8కోట్ల స్కాంలో సూత్రధారులు ఎవరని ప్రశ్నించారు?? అధికారులు,స్థానిక శాసనసభ్యులు తక్షణమే టెండర్ రద్దు చేయాలని,లేనియెడల కలిసివచ్చే అన్ని రాజకీయ పార్టీలతో కలిసి డిపిఆర్ టెండర్ రద్దు అయ్యేవరకు పోరాడుతామని,అవసరమైతే న్యాయస్థానానికైనా వెళ్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గంధం మల్లికార్జునరావు,కొత్తగూడెం నియోజకవర్గ అధ్యక్షుడు నాగుల రవికుమార్,పట్టణ అధ్యక్షుడు గజ్జల శంకర్,వినయ్,సోను,మున్నా తదితరులు పాల్గొన్నారు.



## ములుగులో ఆగస్టు 13న ఘనంగా తిరంగా ర్యాలీ

- పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలి
- సిరికొండ బలరాం. బిజెపి ములుగు జిల్లా అధ్యక్షుడు.

**ప్రజా వాయిస్ ములుగు జిల్లా ఆగస్టు 11:**/ భారతీయ జనతా పార్టీ ములుగు జిల్లా ఆధ్వర్యంలో ఆగస్టు 13న ఉదయం 10 గంటలకు ములుగు పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం తెలిపారు. ర్యాలీ విజయవంతం కోసం మంగళవారం ములుగు రాయల్ ప్లాజాలో సన్నాహక సమావేశం నిర్వహించారు.జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం మాట్లాడుతూ..... జాతీయ జెండా దేశ గౌరవం, ఐక్యత, స్వాతంత్ర్యానికి ప్రతీక అని అన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 10 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు. ఆగస్టు 13న నిర్వహించే తిరంగా ర్యాలీలో విద్యార్థులు, యువత, మహిళలు, రైతులు, ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలు పార్టీలకు అతీతంగా పెద్ద సంఖ్యలో పాల్గొనాలని బలరాం కోరారు. “స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ జాతీయ జెండా గౌరవాన్ని కాపాడాలి. ప్రతి ఇంటిపై తిరంగా ఎగురవేసి దేశభక్తిని చాటాలి” అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భూక్యా జవహర్ లాల్, జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీలమంతుల రవింద్రాచారి, జాడి వెంకట్, నగరపు రమేశ్, సీనియర్ నాయకులు భూక్యా రాజునాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు జినుకల కృష్ణాకర్ రావు, మండల అధ్యక్షులు రాయంచు నాగరాజు, గాదం కుమార్, శ్రీకాంత్, మేరుగు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ స్టేట్ జనరల్ సెక్రటరీగా-వింజమూరి శేఖర్

**ప్రజా వాయిస్/దేవరకొండ** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఎస్సీ డిపార్ట్మెంట్ స్టేట్ జనరల్ సెక్రటరీగా నన్ను నియమించినందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి, టీపీసీసీ నాయకత్వానికి, ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర చైర్మన్ మరియు మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణకి మరియు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.నాపై విశ్వాసం ఉంచి ఇంతటి ముఖ్యమైన బాధ్యతను అప్పగించడం నాకు ఎంతో గౌరవంగా, బాధ్యతగా భావిస్తున్నాను. పార్టీ నాయకత్వం నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా అంకితభావంతో పనిచేస్తాను.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, భారత రాజ్యాంగం అందించిన సామాజిక న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సోదర భావం అనే విలువలకు కట్టుబడి పనిచేస్తూ, ఎస్సీ వర్గాల హక్కులు, సంక్షేమం, అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తాను.రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ డిపార్ట్మెంట్‌ను మరింత బలోపేతం చేయడం, పార్టీ కార్యకర్తలను సమన్వయం చేయడం, ఎస్సీ వర్గాల సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడం, వాటి పరిష్కారం కోసం ప్రజల తరఫున నిబద్ధతతో పనిచేయడం నా ప్రధాన లక్ష్యాలుగా పనిచేస్తాను.నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ నాయకత్వానికి, నాకు ఎల్లప్పుడూ అండగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు.పార్టీ బలోపేతం కోసం, ఎస్సీ వర్గాల అభ్యున్నతి కోసం, సామాజిక న్యాయం కోసం మరింత బాధ్యతతో, నిబద్ధతతో పనిచేస్తానని ఈ సందర్భంగా అయన అన్నారు.



## అర్హులందరికీ వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలి

- లేనిపక్షంలో మున్సిపల్, కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తాం
- బీజేపీ నాయకుల హెచ్చరిక

**ప్రజా వాయిస్.మంచిర్యాల.** తెలంగాణలో అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేసిందని బీజేపీ నాయకులు మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నప్పటికీ కొత్త పెన్షన్లు మంజూరు చేయకపోగా, ఇప్పటికే మంజూరైన అనేక పెన్షన్లను తొలగించిందని ఆరోపించారు. ఇప్పటివరకు ఎన్ని పెన్షన్లు తొలగించారనే వివరాలను కూడా ప్రభుత్వం వెల్లడించడం లేదని విమర్శించారు.ప్రస్తుతం కొత్త పెన్షన్లు ఇస్తామని మరోసారి ప్రజల్లో ఆశలు కల్పిస్తున్న ప్రభుత్వం, ఎంతమందికి పెన్షన్లు మంజూరు చేస్తుందో స్పష్టమైన లెక్క చెప్పడం లేదన్నారు. కేవలం వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించడం బాధాకరమని పేర్కొన్నారు. వృద్ధులు, బీడీ కార్మికులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, ఎయిడ్స్ బాధితులు, డయాలసిస్ రోగులు తదితర అర్హుల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా బీజేపీ ఫ్లోర్ లీడర్ ముకేశ్ గౌడ్, కార్పొరేటర్ కస్తూరి నాగరాజు, బోట్ల అనిత సత్యం తదితర బీజేపీ నాయకులు మాట్లాడుతూ——ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరించి, ఎలాంటి రాజకీయ వివక్ష లేకుండా వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ మంజూరు చేయకపోతే ప్రజలతో కలిసి మున్సిపల్ కార్యాలయం, కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తామని బీజేపీ నాయకులు హెచ్చరించారు.



# మంజునాథ గుంతలో దాగిన అసలు గుట్టేంటి..?

- రూ.3 కోట్ల ధాన్యం లెక్కల్లో గందరగోళం నిజమేనా
- రూ.10 లక్షల 'ముక్తి' వెనుక మర్మమేంటి..?
- టాస్క్ ఫోర్స్ తనిఖీల వెనుక ఎవరి సమాచారం..?
- ఆ తర్వాత రంగంలోకి దిగింది ఎవరు..?
- "సివిల్ సప్లయ్ తో మాట్లాడతా" అంటూ రూ.10 లక్షల డీల్ నడిచిందా..?
- సమాచారం ఇచ్చింది ముక్తేశ్వరుడేనా..?
- మంజునాథుడి 'ముక్తి' కోసం సెటిల్ మెంట్ చేసింది శ్రీనివాసుడేనా..?



**మంచిర్యాల, ఆగస్టు 11 (ప్రజా వాయిస్):** జిల్లాలోని జైపూర్ మండలం ఇందారం గ్రామ పరిధిలోని రెండు రోజుల క్రితం మంజునాథ్ రైస్ మిల్లుకు సంబంధించిన తనిఖీల వ్యవహారం ప్రస్తుతం మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలో హాట్‌టాపిక్‌గా మారింది. మిల్లుపై రామగుండం టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందించింది ముక్తేశ్వరుడేనా..? ఆ తర్వాత సివిల్ సప్లయ్ అధికారులతో మాట్లాడి వ్యవహారాన్ని నడిపిస్తానని, "ముక్తి కల్పిస్తా" అంటూ శ్రీనివాసుడు రూ.10 లక్షలు తీసుకున్నారనే ఆరోపణలు తెరపైకి రావడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఒకవైపు టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం.. మరోవైపు తనిఖీల అనంతరం సెటిల్‌మెంట్ వ్యవహారంలో మళ్లీ అదే వ్యక్తి కీలకంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రామగుండం టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం ఇచ్చింది ముక్తేశ్వరుడే.. ముక్తి కోసం సెటిల్‌మెంట్ చేసింది కూడా ముక్తేశ్వరుడేనా..? అన్న ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. అసలు ఈ రూ.10 లక్షల వ్యవహారం ఏమిటి? ఎవరికి ముక్తి కల్పించేందుకు ఈ మొత్తం తీసుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి? సివిల్ సప్లయ్ అధికారులతో నిజంగా ఏం మాట్లాడారు? అన్న ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత, ఎవరి పాత్ర ఎంత అన్నది అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. డబ్బులు తీసుకున్నారనే ఆరోపణ నిజమైతే దానికి సంబంధించిన ఆధారాలు, లావాదేవీల వివరాలు, ఫోన్ సంభాషణలు, మధ్యవర్తిత్వం చేసిన వ్యక్తుల వివరాలు బయటకు రావాల్సిన అవసరం ఉంది. కేవలం ఆరోపణలకే పరిమితం కాకుండా సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ జరిపితేనే అసలు విషయం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అందుకే రూ.10 లక్షల 'ముక్తి' వ్యవహారంతో పాటు సమాచారం ఇచ్చింది ఎవరు.. సెటిల్‌మెంట్ చేసింది ఎవరు.. లబ్ధి పొందింది ఎవరు అనే కోణంలోనూ విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

### మంజునాథ్ రైస్ మిల్లులో రూ.3 కోట్లకు పైగా ధాన్యం మిస్ అయ్యిందా..? టాస్క్ ఫోర్స్ తనిఖీల్లో అసలు బయటపడిందేమిటి..?

మంజునాథ్ రైస్ మిల్లులో రూ.3 కోట్లకు పైగా విలువైన ధాన్యం మిస్ అయ్యిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే నిజమైతే ఇంత భారీ మొత్తంలో ధాన్యం లెక్కల్లో తేడా ఎలా వచ్చింది? రికార్డుల్లో ఉన్న నిల్వలు ఎంత? వాస్తవంగా మిల్లులో ఉన్న నిల్వలు ఎంత? టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో ఏం గుర్తించారు? అనే ప్రశ్నలు కీలకంగా మారాయి. మంజునాథ్ గుంతలో దాగిన అసలు లెక్కలు బయటపడాలంటే కాగితాల తనిఖీ కాదు.. పూర్తిస్థాయి ఫిజికల్ వెరిఫికేషన్ జరగాల్సిందే అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ధాన్యం కొనుగోలు, తరలింపు, మిల్లింగ్, సీఎంఆర్ అప్పగింత వరకు ప్రతి దశకు సంబంధించిన రికార్డులను పరిశీలించాల్సిన అవసరం ఉంది. రికార్డుల్లో ఉన్న నిల్వలు, గోదాములు లేదా మిల్లులో వాస్తవంగా ఉన్న నిల్వలతో సరిపోతున్నాయా లేదా అన్నది తేల్చాలి. ముఖ్యంగా టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో ఏ మేరకు స్టాక్ తేడా గుర్తించారు? ఏ పత్రాలు స్వాధీనం చేసుకున్నారు? ఎలాంటి నివేదిక రూపొందించారు? అనే వివరాలు బయటకు రావాల్సి ఉంది. ఒకవేళ భారీగా తేడాలు ఉన్నట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి రూ.3 కోట్లకు పైగా ధాన్యం వ్యవహారంపై పూర్తి లెక్కలు బయటపెట్టడంతో పాటు టాస్క్‌ఫోర్స్ తనిఖీ నివేదికను కూడా స్పష్టంగా వెల్లడిస్తేనే మంజునాథ్ గుంతలోని అసలు గుట్టు బయటపడే అవకాశం ఉంది.

### కీలక ప్రజాప్రతినిధి పేరు చెప్పుకుని కొన్ని మిల్లులపై టార్గెట్ తనిఖీలు.. ముక్తి కల్పించడం కోసం మళ్లీ రంగంలోకి శ్రీనివాసుడేనా..?

కీలక ప్రజాప్రతినిధి పేరు చెప్పుకుని కొన్ని రైస్ మిల్లులను టార్గెట్‌గా చేసుకుని తనిఖీలు చేపించారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే తనిఖీల తర్వాత అదే వ్యవహారంలో శ్రీనివాసుడు మళ్లీ రంగంలోకి దిగడం వెనుక అసలు మతలబేంటి? ఒకవైపు తనిఖీలు.. మరోవైపు "నేను చూసుకుంటా.. ముక్తి కల్పిస్తా" అంటూ వ్యవహారం నడిపినట్లు వస్తున్న ఆరోపణలు.. ఇవన్నీ యాదృచ్ఛికమా? లేక తెరవెనుక ఏదైనా సెటప్ నడిచిందా? అన్నది తేలాల్సి ఉంది. రామగుండం టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందించింది ముక్తేశ్వరుడే.. తనిఖీలు జరిగిన తర్వాత ముక్తి కోసం సెటిల్‌మెంట్ వ్యవహారాన్ని నడిపింది కూడా ముక్తేశ్వరుడేనా..? అనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ఈ రెండు అంశాల మధ్య సంబంధం ఏమిటో అధికారులు తేల్చాల్సి ఉంది. ప్రజాప్రతినిధుల పేర్లను అడ్డు పెట్టుకుని ఎవరైనా వ్యక్తిగత లబ్ధి పొందుతున్నారా అనే కోణంలోనూ విచారణ జరగాల్సిన అవసరం ఉంది. ప్రజాప్రతినిధుల పేర్లు వినిపించడం వల్ల వ్యవహారం మరింత సున్నితంగా మారుతోంది. అయితే ఎవరిపైనా ఆధారాలు లేకుండా ఆరోపణలు మోపకుండా, ఎవరు ఏ సందర్భంలో ఏం మాట్లాడారు, ఎవరితో సంప్రదింపులు జరిపారు అన్న అంశాలను విచారణలో నిర్ధారించాలి. తనిఖీల వెనుక ఉద్దేశం ఏదైనా.. సమాచారం నుంచి సెటిల్‌మెంట్ వరకు ఒకే వ్యక్తి పాత్ర ఉందనే ఆరోపణల్లో నిజమెంత అనేది అధికారిక విచారణలో తేలాల్సిందే.

### 2024 సివిల్ సప్లయ్ ట్యాగింగ్ నుంచి రీసైక్లింగ్ దందా వరకు.. ఫిజికల్ వెరిఫికేషన్ కు అధికారులు ఎందుకు వెనుకంజ..?

2024లో సివిల్ సప్లయ్ ట్యాగింగ్ కోసం జరిగిన ఖర్చు ఎంత? అందులో ముక్తా పాత్ర ఎంత? రూ.3 కోట్లకు పైగా వ్యవహారం బయటపడకుండా రీసైక్లింగ్ దందాకు పన్నాగం వేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా మంజునాథ్ రైస్ మిల్లులో పూర్తిస్థాయి ఫిజికల్ వెరిఫికేషన్‌కు సివిల్ సప్లయ్ అధికారులు ఎందుకు వెనుకంజ వేస్తున్నారనే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. "ముక్తి కల్పిస్తా" అంటూ శ్రీనివాసుడు రూ.10 లక్షలు తీసుకున్నారనే ఆరోపణల్లో నిజమెంత? రామగుండం టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం ఎవరు ఇచ్చారు? ముక్తేశ్వరుడే సమాచారం ఇచ్చారనే ఆరోపణల్లో నిజమెంత? అదే వ్యవహారంలో ముక్తి కోసం సెటిల్‌మెంట్ కూడా ముక్తేశ్వరుడే చేశారనే ఆరోపణలు ఎంతవరకు వాస్తవం? అన్న ప్రశ్నలకు అధికారిక విచారణే సమాధానం చెప్పాలి. 2024 నుంచి ఇప్పటివరకు మిల్లుకు సంబంధించిన ధాన్యం కేటాయింపులు, ట్యాగింగ్, రవాణా, మిల్లింగ్, సీఎంఆర్ అప్పగింత, నిల్వల వివరాలను ఒకదానితో ఒకటి పోల్చి చూడాల్సిన అవసరం ఉంది. అలాగే రికార్డుల్లో చూపిన ప్రతి లాట్‌కు సంబంధించి వాస్తవ నిల్వలను అధికారులు ప్రత్యక్షంగా పరిశీలిస్తేనే లెక్కల్లో ఉన్న అసలు తేడాలు బయటపడే అవకాశం ఉంది. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు, ఆరోపణలు నిరాధారమని తేలితే సంబంధితులకు స్పష్టమైన క్లీన్‌చిట్ ఇవ్వాల్సి ఉంటుంది. మొత్తానికి మంజునాథ్ రైస్ మిల్లు వ్యవహారంలో 'ముక్తి' ఎవరికీ? ఎందుకు? ఏ ప్రాతిపదికన? సమాచారం ఇచ్చింది ఎవరు? సెటిల్‌మెంట్ చేసింది ఎవరు? రూ.10 లక్షలు ఎవరి కోసం తీసుకున్నారనే ఆరోపణల్లో నిజమెంత? అన్న ప్రశ్నలకు సమాధానం రావాలంటే పారదర్శకమైన పూర్తిస్థాయి విచారణ తప్ప మరో మార్గం లేదు.

# పాలకుర్తి చెన్నూరు రిజర్వాయర్ పనులను వేగవంతం చేయాలి

- సాగునీటి వనరుల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి
- రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- పాలకుర్తి చెన్నూరు రిజర్వాయర్ పనుల పురోగతిని వేగవంతం చేసి పెండింగ్లో ఉన్న అంశాలను పరిష్కరించాలి
- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి





**ప్రజా వాయిస్/పాలకుర్తి** (జనగామ జిల్లా)హనుమకొండ చింత గట్టులోని సీఈ వరంగల్ ఇరిగేషన్ కార్యాలయంలో జే. చొక్కారావు దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ జె సి ఆర్ డి ఎల్ ఐ ఎస్ (JCR-DLIS)పై ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన శాసన సభ్యులతో ఈ ఎన్ సి ఓ.వి. రమేష్ బాబు గారి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో సహచర ఎమ్మెల్యేలతో పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి పాల్గొని పాలకుర్తి నియోజకవర్గానికి సంబంధించిన సాగునీటి సమస్యలు, దేవాదుల ప్రాజెక్టు పనుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న పనులపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. పాలకుర్తి నియోజకవర్గానికి ఎంతో కీలకమైన పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు. రిజర్వాయర్ పనులు పూర్తయితే నియోజకవర్గంలోని రైతులకు సాగునీటి వసతి మరింత మెరుగుపడి, వ్యవసాయ రంగానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.అదేవిధంగా దేవరుప్పుల మండలం ధర్మగడ్డ తండా సమీపంలో కాలువ క్లియరెన్స్ లేకపోవడంతో రైతులకు సాగునీరు అందడం లేదని ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించి కాలువలో ఉన్న అడ్డంకులను తొలగించి, రైతులకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే పాలకుర్తి నియోజకవర్గంలోని దేవాదుల కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, ఆయకట్టు ప్రాంతాల్లో నీటి సరఫరాకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.ఎమ్మెల్యే లేవనెత్తిన సమస్యలపై స్పందించిన ఈ ఎన్ సి ఓ.వి. రమేష్ బాబు , సంబంధిత ఇరిగేషన్ అధికారులకు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధర్మగడ్డ తండా సమీపంలోని కాలువ సమస్యను పరిశీలించి క్లియరెన్స్ పనులను త్వరగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.అదేవిధంగా పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ పనుల పురోగతిని వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్తామని వెల్లడించారు.రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి , పాలకుర్తి నియోజకవర్గంలో సాగునీటి వనరుల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.



# భూమి డబ్బుల వివాదం

- తహసీల్దార్ ఆఫీస్ వద్ద యువకుడి ఆత్మహత్యాయత్నం
- రూ.1 లక్ష అడ్వాన్స్ కు రూ.2 లక్షలు డిమాండ్ చేశారని బాధితుల ఆరోపణ

**ప్రజా వాయిస్/ కేసముద్రం** కేసముద్రం మండల తహసీల్దార్కార్యాలయం వద్ద ఓ యువకుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. భూమి విక్రయానికి సంబంధించిన డబ్బుల వ్యవహారమే ఘటనకు కారణమని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. బాధితుల కథనం ప్రకారం.. నెక్కొండ మండలం నాగారం గ్రామానికి చెందిన పరకాల అమృతమ్మ, ఆమె భర్త చిన్న కొమురయ్య కు సంబంధించిన భూమిని రూ.16 లక్షలకు ఒక వ్యక్తి (కొనుగోలు దారుడు) కొనుగోలు చేసేందుకు ఒప్పందం జరిగినట్లు తెలిపారు. ఇందులో భాగంగా రూ. లక్ష అడ్వాన్స్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అయితే కుటుంబ పరిస్థితులు,కుటుంబ సభ్యుల అభ్యంతరాల కారణంగా భూమిని విక్రయించలేమని చెప్పినట్లు బాధితులు తెలిపారు. దీంతో ఇచ్చిన అడ్వాన్స్ మొత్తాన్ని తిరిగి ఇస్తామని చెప్పినప్పటికీ, డబ్బుల విషయంలో వివాదం ఏర్పడినట్లు వారు ఆరోపిస్తున్నారు. రూ.లక్ష అడ్వాన్స్ కు సంబంధించి రూ.2 లక్షలు తీసుకున్నట్లు కూడా బాధితులు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చిన సమయంలో యువకుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. కొనుగోలు చేసిన వ్యక్తి ఎవరు.., విక్రయదారుని భయభ్రాంతులకు గురిచేసిన అంశం ఏమిటన్నది పోలీసులు, రెవెన్యూ ఉన్నతాధికారులు విచారణ చేపడితే అసలు విషయం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# లక్ష మంది తో సంగారెడ్డి లో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ

- సీఎం చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**ప్రజా వాయిస్,సంగారెడ్డి** : సంగారెడ్డి సీఎం బహిరంగ సభ ఏర్పాట్లపై సెక్రెటేరియట్ లో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిలు సమీక్ష నిర్వహించారు. సమీక్ష సమావేశం లో పాల్గొన్న సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్, నారాయణ్ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి ఈనెల 15న సంగారెడ్డిలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్లపై సచివాలయంలోని తన ఛాంబర్‌లో నీటిపారుదల, పౌర సరఫరా శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నత స్థాయి రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, నారాయణ్‌ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా, మంత్రి దామోదర రాజనర్సింహ వైరల్ ఫీవర్‌తో బాధపడుతుండటం వల్ల ఈ సమావేశానికి హాజరుకాలేకపోయారు. ఈ సందర్భంగా సభకు భారీ జన సమీకరణ, వేదిక ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి సంగారెడ్డికి చేరుకుంటారని, సాయంత్రం 4 గంటల వరకు సంగారెడ్డి లో ఉంటారని నేతలు వెల్లడించారు. సీఎం సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని, జన సమీకరణ, భద్రత, ఇతర ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్, జగ్గారెడ్డి అధికారులకు సూచించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 నియోజకవర్గాల నుండి నియోజకవర్గానికి ఒకరు చొప్పున, మొత్తం పది మంది లబ్ధిదారులకు సీఎం రేవంత్ రెడ్డి సభా వేదికపైనే స్వయంగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తారని మంత్రి తెలిపారు. అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు సూచించారు. సుమారు లక్ష మంది జనంతో ఈ భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జగ్గారెడ్డి స్పష్టం చేశారు.








# ప్రజా సేవలో చెరగని ముద్రకామిడి మధుసూదన్ రెడ్డి పేరిట క్రికెట్ టోర్నమెంట్

- ప్రథమ వర్ధంతి సందర్భంగా ఘనంగా విగ్రహావిష్కరణ
- ముఖ్య అతిథిగా పాల్గొన్న మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

**ప్రజావాయిస్/మేడ్చల్ జిల్లా:** మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సేవలో తనదైన ముద్ర వేసిన కామిడి మధుసూదన్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి హాజరై, కామిడి మధుసూదన్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ..... మూడు చింతలపల్లి గ్రామ అభివృద్ధికి కామిడి మధుసూదన్ రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. గ్రామ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన చేసిన కృషిని కొనియాడారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసిన మధుసూదన్ రెడ్డి సేవలను గ్రామ ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు.అభివృద్ధికి అంకితమైన మధుసూదన్ రెడ్డి సేవలు,కామిడి మధుసూదన్ రెడ్డి గ్రామ అభివృద్ధిని తన బాధ్యతగా భావించి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పలువురు నాయకులు, గ్రామస్తులు గుర్తుచేశారు. ప్రజలతో మమేకమై వారి అవసరాలను తెలుసుకుంటూ గ్రామ అభివృద్ధికి తనవంతు సహకారం అందించారని తెలిపారు. ప్రథమ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన విగ్రహావిష్కరణ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, అభిమానులు, నాయకులు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మధుసూదన్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.14 గ్రామాల యువతతో ఉత్కంఠభరితంగా క్రికెట్ టోర్నమెంట్ కామిడి మధుసూదన్ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన పేరుతో గత నాలుగు రోజులుగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ కూడా ఘనంగా ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 14 గ్రామాలకు చెందిన యువకులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.నాలుగు రోజుల పాటు ఉత్కంఠభరితంగా సాగిన పోటీల్లో కేశవాపూర్ గ్రామ యువకులు అద్భుత ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచారు. విజేత జట్టుకు నగదు బహుమతితో పాటు ట్రోఫీని అందజేశారు. అలాగే పొన్నాల గ్రామ యువకులు ద్వితీయ స్థానంలో నిలిచి, నగదు బహుమతి, ట్రోఫీని అందుకున్నారు.యువతకు చేయూతగా భారీ నగదు ప్రోత్సాహకాలుక్రీడల్లో యువతను ప్రోత్సహించేందుకు మూడు చింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి తన వంతుగా రూ.20 వేల నగదును సొంతంగా అందజేశారు. అలాగే కేశవాపూర్ కౌన్సిలర్ మరిపటి గోవర్ధన్ రెడ్డి రూ.5 వేల నగదును తన సొంతంగా యువకులకు అందించి అభినందించారు.అదేవిధంగా కామేడి మధుసూదన్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో టోర్నమెంట్ విజేతలు, రన్నరప్ జట్లకు వరుసగా రూ.20 వేల, రూ.10 వేల నగదు బహుమతులతో పాటు ట్రోఫీలను అందజేశారు. విజేతలకు బహుమతులు అందజేస్తూ నాయకులు, ప్రజాప్రతినిధులు యువతను అభినందించారు. కామిడి మణెమ్మ మధుసూదన్ రెడ్డి చారిటబుల్ వ్యవస్థాపక అధ్యక్షుడు కామిడి వెంకట నర్సింహా రెడ్డి (బాబు ) ఆధ్వర్యంలో నిర్వహించిన విగ్రహావిష్కరణతో పాటు క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించడం పట్ల స్థానికులు, యువత హర్షం వ్యక్తం చేశారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం ఇలాంటి సామాజిక, క్రీడా కార్యక్రమాలను నిర్వహించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మూడు చింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, అభిమానులు, శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి జూనియర్ కళాశాల విద్యార్థులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు వేతనాలు ఎప్పుడు..?


- పనులు చేసి రోజులు గడుస్తున్నా.. ఖాతాల్లో జమకాని డబ్బులు!
- పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కూలీల వేడుకోలు



**ప్రజా వాయిస్, నల్గొండ** నల్లగొండ జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన కూలీలకు వేతనాలు సకాలంలో అందకపోవడంతో వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తక్కువగా ఉన్న సమయంలో ఉపాధి హామీ పనులే తమకు ప్రధాన ఆధారమని, ప్రభుత్వం కల్పించిన పనులకు కష్టపడి హాజరై పనులు పూర్తి చేసినప్పటికీ వేతనాలు మాత్రం తమ బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని కూలీలు వాపోతున్నారు. ఎండనకా, వాననకా పనులకు హాజరై అధికారులు సూచించిన పనులను పూర్తి చేశామని, పని పూర్తయిన తర్వాత వేతనాలు ఖాతాల్లో జమ అవుతాయని ఆశించామని,రోజులు గడుస్తున్నా డబ్బులు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని. ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలలో ఎక్కువ మంది రోజువారీ కూలీపై ఆధారపడి జీవిస్తున్నారు. పనికి వెళ్లిన రోజుకు వచ్చే వేతనంతోనే ఇంట్లో నిత్యావసర సరుకులు, ఇతర రోజువారీ అవసరాలను నిర్వహించుకుంటామని. ప్రస్తుతం వేతనాలు ఆలస్యం కావడంతో నిత్యావసరాల కోసం కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము చేసిన పనికి సంబంధించిన వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో కుటుంబాలను నెట్టుకురావడం కష్టంగా మారిందని. ప్రభుత్వం ఉపాధి కల్పించినప్పుడు పనికి హాజరై తమ వంతు బాధ్యతగా పనులు పూర్తి చేశామని, ఇప్పుడు తమ కష్టానికి రావాల్సిన వేతనాలను కూడా సకాలంలో అందించాలని కోరుతున్నారు. ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన కూలీలకు సంబంధించిన పెండింగ్ వేతనాలపై అధికారులు వెంటనే దృష్టి సారించి, చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేయాలని కూలీలు విజ్ఞప్తి చేస్తున్నారు. పనుల వివరాలను పరిశీలించి, అర్హులైన కూలీలకు రావాల్సిన వేతనాలను త్వరితగతిన వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసి తమ ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు. ''పనులు చేశాం.. మా కష్టానికి రావాల్సిన డబ్బుల కోసం ఎదురుచూస్తున్నాం. వేతనాలు ఆలస్యం కావడంతో నిత్యావసరాలు తీర్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి మా వేతనాలను వెంటనే ఖాతాల్లో జమ చేయాలి'' అని కూలీలు కోరుతున్నారు.

# నిర్మించి మూడేళ్లు గడుస్తున్ననిర్లక్ష్యంగా వదిలేశారు

- రూ.20 లక్షల ప్రజాధనం వృధా
- గర్భిణులకు గంపెడు కష్టాలు
- చిన్నారులకు చెప్పలేని అవస్థలు
- నిర్మించి ప్రారంభించని దోమకొండ వైద్య ఆరోగ్యశాఖ సబ్ సెంటర్
- దోమకొండ గ్రామపంచాయతీ వైద్య ఆరోగ్యశాఖ తీవ్ర నిర్లక్ష్యం




**ప్రజా వాయిస్ దోమకొండ :**సుమారు 20 లక్షల రూపాయలతో 2023లో చక్కగా నిర్మించారు. నిర్లక్ష్యంగా వదిలేశారు. గర్భిణీ స్త్రీలకు గంపెడు కష్టాలు ఎదురవుతున్నాయి. ఒకటి నుండి తొమ్మిది సంవత్సరాల చిన్నారులకు చెప్పలేని అవస్థలు వస్తున్నాయి. దోమకొండ గ్రామపంచాయతీకి అనుకుని 20 లక్షల రూపాయలకు 2023లో నిర్మించిన వైద్య ఆరోగ్యశాఖ సబ్ సెంటర్ ప్రారంభించకపోవడంతో గర్భిణీ స్త్రీలకు చిన్నారులకు మహిళలకు చెప్పలేని కష్టాలు ఎదురవుతున్నాయి. పాత తాలూకా కేంద్రం సుమారు 20వేల జనాభా గల దోమకొండ లో నిర్మించి మూడు ఏళ్లు గడుస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సబ్ సెంటర్ అందుబాటులోకి రాకపోవడంతో వందలాది మంది గర్భిణీలు చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అత్యవసర, ప్రాణాంతక వైద్య సేవలు ఉండాల్సిన చోట వైద్య చికిత్సలు మందుల సరఫరా చిన్నారులకు ఇవ్వాల్సిన టీకాలు ఇతర ప్రాణాంతక నిరోధక వైద్య సేవలు అందుబాటులోకి రాకపోవడంతో చెప్పలేని కష్టాలు ఎదుర్కొంటున్నారు. సబ్ సెంటర్ చుట్టూ అడుగుల దూరంలో దోమకొండ గ్రామపంచాయతీ, ఎమ్మార్వో కార్యాలయం, ఎంపి డిఓ కార్యాలయం, వ్యవసాయ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండు అతి దగ్గరలో ఉన్న, నిర్మించి మూడేళ్లు అవుతున్న గడుస్తున్న అతి ముఖ్యమైన వైద్య సేవలు అందించే సబ్ సెంటర్ అందుబాటులోకి రాకపోవడంతో మహిళలు చిన్నారులు తీరని వేదనకు గురవుతున్నారు. దోమకొండ గ్రామపంచాయతీ పాలకవర్గం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల నిర్లక్ష్యంతో వందల మందికి 20 లక్షల రూపాయల వ్యయంతో భవనం నిర్మించిన వైద్య సేవలు, టీకాలు మందుల సరఫరా రోగ నిర్ధారణ పరీక్షలు అందుబాటులోకి రాకపోవడంతో దోమకొండ మండల తీవ్ర విమర్శలు చేస్తున్నారు. అధికారులకు చిత్తశుద్ధి లోపించడం, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం, అధికార పార్టీ నేతలకు తీరిక లేకపోవడం పట్ల దోమకొండ మండల వాసులు మహిళలు చిన్నారుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కమ్యూనిటీ హెల్త్ సెంటరు లో నడుస్తున్న హెల్త్ సెంటరు ను డాక్టర్లు పొమ్మంటున్నారు. ఆరోగ్య శాఖ అధికారులు, పంచాయతీ పాలక వర్గం, సర్పంచ్ ప్రారంభించడం లేదని ఆరోగ్య శాఖ సిబ్బంది ఆవేదన చెందుతున్నారు.సుమారు 20 వేల జనాభా కలిగి, కామారెడ్డి జిల్లాలో అతిపెద్ద గ్రామపంచాయతీ అయి,పాత తాలూకా కేంద్రం లో అత్యవసర వైద్య సేవలు అందించి సబ్ సెంటర్ నిరుపయోగంగా పడింది. ప్రతిరోజువందలాది చిన్నారులకు టీకాల పంపిణీ కావడం లేదు.గర్భిణి స్త్రీలు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి భవనం నుండి పొమ్మంటున్నారు. భవనం నిర్మించి స్టార్ట్ చేయకుండా వదిలేసారు.వైద్య ఆరోగ్య శాఖ నిర్లక్ష్యానికి ప్రతీక గా ఉండింది.దోమకొండ సబ్ సెంటర్ దుస్థితి గ్రామాల్లో తీవ్ర చర్చ అవుతుంది.దోమకొండ లో పలుగడ్డ ప్రాంతంలో అద్దెగదిలో రెండో సబ్ సెంటర్ నిర్వహణ జరుగుతుంది. పాలక వర్గానికి, అధికారులు పట్టింపు లేదు, అధికార పార్టీ నేతలకు తీరిక లేదని ప్రజల వ్యాఖ్యానిస్తున్నారు. 27-9-2023 లో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సబ్ సెంటర్కు 20 లక్షల రూపాయల నిధులతో శంకుస్థాపన చేశారు.చక్కగా నిర్మించి లక్షణంగా వదిలేశారనీ మండలంలో విమర్శలు వస్తున్నాయి.మాజీ ఉప గజవాడ శ్రీకాంత్, గంద్ర మధుసూదన్ కాంట్రాక్టర్ లు నిర్మించారు. సబ్ సెంటర్ భవనంలో ఫ్లోరింగ్ నిర్మించలేదు.కిటికీలు ఆమార్చలేదు,దర్వాజలు పెట్టలేదు, కరెంటు సరఫరా లేదు,వాటర్ వసతి లేదుకనీస సౌకర్యాలు కూడా లేవు అని విమర్శలు ఎదురవుతున్నాయి.దోమకొండ పంచాయతీ ఆఫీసు వెనకాల ఏళ్ళతరబడి నిర్లక్ష్యం తో ఉండడం, సబ్ సెంటర్ భవనంలోపాములు తేళ్లు సంచారం చేస్తున్నాయని స్థానికవాసులు వాపోతున్నారు. 20 లక్షల తో నిర్మించిన సబ్ సెంటర్ భవనము ఉపయోగించకుండా పలుగడ్డ ప్రాంతంలో రెండో సబ్ సెంటర్ ను ప్రారంభించడంతో మండల వాసులు విమర్శిస్తున్నారు.




# హామీలు మరిచి పాలన సాగిస్తే ప్రజలు సహకరించరు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని ప్రజాస్వామ్య పరిరక్షణకు మార్పు అవసరం
- ప్రజా చైతన్య యాత్రకు ఘన స్వాగతం ప్రధాన రహదారిపై భారీ ర్యాలీ

**జూలూరుపాడు, ప్రజా వాయిస్:** కేంద్రంలో మోడీ సర్కార్ నియంతృత్వ పోకడలు రాష్ట్రంలో హామీలను గాలికి వదిలి ప్రజల సమస్యలు పరిష్కరించడం లేదని, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కునంనేని సాంబశివరావు విమర్శించారు. ప్రజా చైతన్య యాత్ర మంగళ వారం జూలూరుపాడు చేరుకుంది. పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలుకుతూ ప్రధాన రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన సెంటర్లో ఏర్పాటుచేసిన మీటింగ్ లో సాంబశివరావు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఏట రెండు కోట్ల ఉద్యోగాలు ఖాతాలో 15 లక్షలు, జమ ఉపాధి కల్పన వంటి కీలక హామీలను పక్కనపెట్టి మత విద్వేషాలతో కాలం వెల్లదీస్తుందని ఆరోపించారు. నీట్ కుంభకోణంతో లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తును చీకట్లో పడేసిందని, దీనికి నిరసనగా జంతర్ మంతర్ వేదిక గా విద్యార్థులు, యువత సాగించిన పోరాటం మోడీ దిమ్మతిరిగేలా షాక్ ఇచ్చారని, దేశ సంపదను కొంతమంది కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. దేశంలో త్వరితగతిన సామాజిక, రాజకీయ మార్పు రావాల్సిన అవసరం ఉందని, అందుకోసం సిపిఐ నడుం బిగిస్తుందని తెలిపారు. యాత్రలో భాగంగా అనంతారం, గాంధీనగర్ వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే షాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, పుల్లారెడ్డి, కొత్తగూడెం మేయర్ మూడు గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రనరేంద్ర కుమార్, నరాటి ప్రసాద్, చంద్రగిరి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, భూక్య శ్రీనివాస్, ఎస్కే ఫయుం, వరక అజిత్, సీపీఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, ఎస్కే నాగుల్ మీరా, ఎల్లంకి మధు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వాయిస్ వార్త ఎఫెక్ట్.. తహసీల్దార్ కార్యాలయ పరిసరాలు శుభ్రం

**ప్రజా వాయిస్ టేక్మాల్ :** తహసీల్దార్ కార్యాలయ పరిసరాల్లో నెలకొన్న అపరిశుభ్రతపై 'ప్రజా వాయిస్'లో సోమవారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. కార్యాలయం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు.ఇటీవల తహసీల్దార్ కార్యాలయం పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని 'ప్రజా వాయిస్' వార్త ద్వారా వెలుగులోకి తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి పారిశుద్ధ్య సిబ్బందితో కార్యాలయ పరిసరాలను శుభ్రం చేయించారు.పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు చెత్తాచెదారం తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.







# మండల సర్పంచ్ ల సంఘం ఎన్నిక

- అధ్యక్షుడిగా భూక్య ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కొర్సా రమేష్ ఏకగ్రీవ ఎన్నిక
- ఎన్నికైన సర్పంచ్ లను సన్మానించిన లేళ్ళ

**జూలూరుపాడు, ప్రజా వాయిస్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల కేంద్రంలో మంగళ వారం మండల సర్పంచ్ ల సంఘం నూతన కమిటీని వివిధ గ్రామ పంచాయతీల సర్పంచ్ లు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. సర్పంచ్ ల సంఘం మండలం అధ్యక్షుడు గా అన్నారపాడు సర్పంచ్భూక్య ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా అనంతారం సర్పంచ్ కొర్సా రమేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఉపాధ్యక్షులుగా సాయిరాం తండా సర్పంచ్ బానోత్ సుమలత, సహాయ కార్యదర్శులుగా శంభుని గూడెం సర్పంచ్ తాటి సువార్త, మాచినపేట సర్పంచ్ బానోత్ కృష్ణ, నర్సాపురం సర్పంచ్ సంఘం లక్ష్మి కుమారి తోపాటు, కోశాధికారిగా వినోబా నగర్ సర్పంచ్గంగావత్ నవీన్, ప్రచార కార్యదర్శిగా గుండ్లరేవు సర్పంచ్ భూక్య చంద్రబాబు, గౌరవ సలహాదారులుగా సూరారం సర్పంచ్ చింతా జగన్నాధం, మాచినేనిపేట తండా సర్పంచ్ లాకావత్ రెడ్డి ని ఏకీగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా ఎన్నికైన మండల సర్పంచ్ ల సంఘం ప్రతినిధులను జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు లేళ్ళ వెంకటరెడ్డి ఎన్నికైన వారిని శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# ఇరవై రోజులుగా అంధకారంలోనే!

- వీధి దీపాలు వెలగడం లేదని అర్జీ పెట్టిన పట్టించుకునే నాదుడే లేడు
- ఇదేనా సారు ప్రజా పాలన అంటే
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నాగారం డివిజన్ లోని పలు కాలనీల ప్రజలు



**ప్రజా వాయిస్/కీసర :** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మున్సిపల్ కార్పొరేషన్ ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ పరిధి లోనీ ఎస్వి నగర్ కాలనీ,భాగ్యనగర్ కాలనీ, విష్ణుపూరి, విజయపురి, బాపూజీ నగర్ కాలనీ,శాంతి నగర్ కాలనీలలో అందకారం రాజ్యమేలుతోందనీ అక్కడి ప్రజలు అంటున్నారు. అక్కడ కాలనీలలో నివసిస్తున్న ప్రజలు ఆన్లైన్లో వీధిదీపాలు వెళగడం లేదని ఎన్ని ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదంటున్నారు. వీధి దీపాలు 20 రోజులుగా వెలగడం లేదని, చిమ్మ చీకట్లో ఉంటున్నట్లు ఉందన్నారు. ప్రజా పాలన అంటే ప్రజలు ఇబ్బందులు పడాల సారు!, జెర్ర మా కాలనీలలో ఉన్న సమస్యను తీర్చండి అంటూ విన్నవించుకుంటున్నారు. హైదరాబాద్ ప్రజలందరూ అంగరంగ వైభవంగా విద్యుత్ కాంతులతో బోనాల పండుగ జరుపుకున్నారు. కానీ మా నాగారం పరిధిలోని కాలనీలు చిమ్మ చీకట్లో పండుగ జరుపుకున్నామంటే, ప్రభుత్వం ప్రజలకు కల్పిస్తున్నా మౌలిక వసతులు, సదుపాయాలు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. పేరుకేమో ప్రజాపాలన అని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వ పెద్దలు క్షేత్ర స్థాయిలో ప్రజలు చిమ్మ చీకట్లో ఉండడమే ప్రజాపాలనకూ నిదర్శనం దీనికి బాధ్యులు ఎవరు? బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తున్న ఘట్కేసర్ సర్కిల్ ఎలక్ట్రికల్ విభాగం అధికారులపై తక్షణమే శాఖ పరమైన చర్యలు తీసుకొని భవిష్యత్తులో ప్రజలకు ఇలాంటి అసౌకర్యం కలగ కుండా సేవలందించాలని అక్కడి కాలానిల ప్రజలు కోరుకుంటున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంపై డా. తాటికొండ రాజయ్య సంచలన వ్యాఖ్యలు

- పార్టీ మారితనే పనులు చేస్తాం అంటూ బ్లాక్ మెయిల్ రాజకీయాలు
- ఇప్పటికీ కాల్వల ద్వారా నీటిని విడుదల చేయని పరిస్థితి
- దేవాదులపై కడియం శ్రీహరికి అవగాహన లేదు
- కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలి
- పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం సహకరించాలి
- స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



**ప్రజా వాయిస్ /స్టేషన్ ఘనపూర్** (జనగామ జిల్లా )జనగామ జిల్లా స్టేషన్ ఘనాపూర్ నియోజకవర్గ కేంద్రంలోని బీ ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో తెలంగాణ మాజీ తొలి ఉపముఖ్యమంత్రి, బీ ఆ ర్ ఎస్ పార్టీ స్టేషన్ ఘనాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా. తాటికొండ రాజయ్య పలు కీలక అంశాలపై మాట్లాడారు.

## దళిత క్రైస్తవులపై వివక్షపై ప్రశ్నలు

దేశంలో దళిత క్రైస్తవులపై బీజేపీ ప్రభుత్వం వివక్ష చూపుతోందని డా. రాజయ్య ఆరోపించారు.హిందూ మతంలో ఉంటేనే దళితులకు ఎస్సీ హోదా కల్పించే విధానం కొనసాగడం వివక్ష కాదా? అని ప్రశ్నించారు.ఈ విషయంలో సిక్కులు, బౌద్ధులకు ఉన్న వెసులుబాటు దళిత క్రైస్తవులకు ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు.బీసీ వర్గానికి చెందిన వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారినా వారి కుల గుర్తింపు మారకుండా ఉండే పరిస్థితి ఉంటే, కేవలం దళితుల విషయంలోనే ఈ వివక్ష ఎందుకు? అని నిలదీశారు.జనగణన (Census) ప్రక్రియ ప్రారంభం కాకముందే పార్లమెంట్‌లో బిల్లు పెట్టి దళిత క్రైస్తవుల సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ లో మాదిగలకు వివక్ష ఎందుకు?

తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ మాదిగలకు టికెట్లు ఇవ్వకుండా వివక్ష చూపుతోందని విమర్శించారు.మందుల శామ్యూల్ వంటి ఎమ్మెల్యేలు కూడా వివక్షను ఎదుర్కొంటున్నారని అన్నారు.ఎంపీ సీట్ల కేటాయింపులో కూడా రేవంత్ రెడ్డి మాదిగలపై వివక్ష చూపించారని ఆరోపించారు.

## రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రశ్నలు

హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో విధ్వంసం సృష్టిస్తున్నారని విమర్శించారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై కూడా గౌరవం లేకుండా రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు.బీఆర్ఎస్ దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డంకులు సృష్టించకుండా సహకరించాలని కోరారు.ప్రతిరోజూ వరద నీటిని ఆంధ్ర ప్రదేశ్‌కు తరలిస్తూ తెలంగాణ ప్రయోజనాలకు నష్టం చేస్తున్నారని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు.కనీసం ఆగస్టు 15 నుంచి అయినా కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## కడియం శ్రీహరిపై డా. రాజయ్య తీవ్ర విమర్శలు

బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టిస్తున్నారని కడియం శ్రీహరిపై ఆరోపణలు చేశారు.పార్టీ మారితేనే పనులు చేస్తాం" అంటూ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ₹1,400 కోట్ల అభివృద్ధి అంటూ ఫ్లెక్సీలు పెట్టుకునే కడియం శ్రీహరి, ఆ అభివృద్ధి పనులు ఎక్కడ జరిగాయో ప్రజలకు చూపించాలని ప్రశ్నించారు.డిగ్రీ కళాశాల పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదని అన్నారు. మున్సిపాలిటీ కమిషనర్ ఫ్లెక్సీలకు ఇచ్చిన అనుమతులను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.కడియం శ్రీహరికి అటవీ భూములను కబ్జా చేసిన చరిత్ర ఉందని ఆరోపించారు. దేవాదులపై కడియం శ్రీహరికి అవగాహన లేదని విమర్శ దేవాదుల ప్రాజెక్టు విషయంలో కడియం శ్రీహరికి సరైన అవగాహన లేదని డా. రాజయ్య విమర్శించారు.దేవాదుల ద్వారా 38 టీఎంసీ ల నీటిని సరఫరా చేసే అవకాశం ఉన్నప్పటికీ, ఆ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం లేదని అన్నారు. ఇప్పటి వరకు కాలువల ద్వారా నీటిని విడుదల చేయని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఉప్పుగల్లు రిజర్వాయర్ నిండినప్పటికీ కాలువలకు నీటిని విడుదల చేసే పరిస్థితి లేదని విమర్శించారు.పెద్ది సుదర్శన్ రెడ్డి ని స్మరించుకుంటూ భావోద్వేగానికి గురైన డా. రాజయ్య పెద్ది సుదర్శన్ రెడ్డి శ్రీరాముడికి హనుమంతుడిలా కేసీఆర్ కు వెన్నంటి ఉండేవారని డా. రాజయ్య అన్నారు.ఆనాడు జిల్లా నాయకుడిగా ఉన్నప్పుడు అందరినీ సమన్వయం చేస్తూ పార్టీని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు.తన ఉపముఖ్యమంత్రి పదవి పోయిన సమయంలో కూడా పెద్ది సుదర్శన్ రెడ్డి తన వెన్నంటి నిలబడి ధైర్యం చెప్పారని భావోద్వేగంతో తెలిపారు.అలాంటి నాయకుడు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.పెద్ది సుదర్శన్ రెడ్డి గురించి మాట్లాడుతున్న సమయంలో డా. తాటికొండ రాజయ్య కన్నీటి పర్యంతమయ్యారు. పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం సహకరించాలని డా. రాజయ్య కోరారు.

## ఉచిత కోచింగ్ ఏర్పాటు చేయాలి




**ప్రజా వాయిస్- క్యాతన్ పల్లి / మందమర్రి:** ఇటీవల పోలీస్ శాఖలో ఉద్యోగాల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో, మంచిర్యాల జిల్లా. క్యాతన్ పల్లి పట్టణంలోని నిరుద్యోగ యువతకు ఉచిత పోలీస్ కానిస్టేబుల్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రజా జాగృతి సమితి అధ్యక్షుడు రాజలింగు మోతె మున్సిపల్ చైర్‌పర్సన్‌కు మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయంలో రిప్రజెంటేషన్ అందజేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన అభ్యర్థులు ప్రైవేట్ కోచింగ్ ఫీజులు భరించలేక ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల మున్సిపాలిటీ సామాజిక బాధ్యతగా భావించి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రాత పరీక్షలతో పాటు ఫిజికల్ ట్రైనింగ్, స్టడీ మెటీరియల్, మాక్ టెస్టులు తదితర సౌకర్యాలను ఉచితంగా అందించాలని కోరారు. పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ వచ్చిన ఈ సమయం చాలా ముఖ్యమైన సమయం కాబట్టి ఈ సందర్భంగా ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా మున్సిపాలిటీ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వేల్పుల వెంకటస్వామి, రామిళ్ళ మల్లేష్,ఎట్టం లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## కోహెడలో బీజేపీ జిల్లా, మండల పదాధికారులకు ఆత్మీయ సన్మానం



**ప్రజా వాయిస్, సిద్దిపేట జిల్లా :** హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మండల్ తంగళ్లపల్లి లో కిష్టస్వామి గుట్టపై మంగళవారం బీజేపీ కోహెడ మండల కార్యవర్గ సమావేశం, బీజేపీ జిల్లా, మండల కమిటీ పదాధికారులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిద్దిపేట బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ హాజరుకానున్నారు. అలాగే రాష్ట్ర, పార్లమెంట్, అసెంబ్లీ స్థాయి నాయకులతో పాటు జిల్లా నాయకులు, పార్టీ పదాధికారులు, కార్యకర్తలు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పార్టీ భవిష్యత్ కార్యక్రమాలు, మండల స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, కార్యకర్తల సమన్వయం తదితర అంశాలపై చర్చించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.
కార్యక్రమానికి మీడియా ప్రతినిధులు హాజరై ప్రెస్ కవరేజ్ అందించాలని బీజేపీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వేంకటేశం కోరారు. సమావేశం అనంతరం నాయకులు, కార్యకర్తలకు భోజన సదుపాయం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## నారాయణఖేడ్ లో ప్రజాస్వామ్య పండుగ..

- ఈ తక్షశిల స్కూల్‌లో ఘనంగా స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలు!
- రియల్ ఎలక్షన్ ని తలపించిన విద్యార్థుల ప్రచారం..
- పక్కా ప్రోటోకాల్‌తో పోలింగ్
- ఓటు హక్కు విలువ, నాయకత్వ లక్షణాలపై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన!



**ప్రజా వాయిస్, నారాయణఖేడ్ :** 'నేటి విద్యార్థులే రేపటి నాయకులు'.. ఈ మాటను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా, ప్రాక్టికల్‌గా విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఒక అద్భుతమైన కార్యక్రమానికి వేదికైంది సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్. నారాయణఖేడ్‌లోని ★'తక్షశిల స్కూల్'★లో విద్యార్థుల కోసం 'స్టూడెంట్ కౌన్సిల్ ఎలక్షన్స్'ను అత్యంత వినూత్నంగా, రియల్ ఎలక్షన్స్ రేంజ్‌లో నిర్వహించారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం
వాయిస్ ఓవర్ స్క్రిప్ట్ విద్యార్థులు నామినేషన్లు వేయడం, ప్రచారం చేయడం, పోస్టర్లు ప్రదర్శించడం) "ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదల దగ్గర నుంచి.. నామినేషన్ల స్వీకరణ, అభ్యర్థుల హోరాహోరీ ప్రచారం వరకు ప్రతీదీ పక్కా ప్లానింగ్‌తో సాగింది. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ స్కూల్ ఫ్రెండ్స్ దగ్గరకు వెళ్లి మ్యానిఫెస్టోలు వివరిస్తూ ఓట్లు అడగడం.. ప్రొఫెషనల్ పొలిటీషియన్లను తలపించేలా సందడి చేసింది." పోలింగ్ రోజున స్కూల్ ఆవరణ అంతా అసలైన పోలింగ్ బూత్‌ను తలపించింది. క్రమశిక్షణతో క్యూ లైన్లలో నిలబడి విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బ్యాలెట్ పేపర్ ఓటింగ్, సీక్రెట్ పోలింగ్ కంపార్ట్‌మెంట్, ఓటు వేసిన తర్వాత వేలికి సిరా చుక్క మార్క్ వేయడం వంటి అన్ని రకాల ప్రోటోకాల్స్‌ను పక్కాగా ఫాలో అయ్యారు. ఉపాధ్యాయులు సైతం ఎలక్షన్ ఆఫీసర్లుగా, రిటర్నింగ్ ఆఫీసర్లుగా వ్యవహరించి ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించారు." కేవలం చదువు మాత్రమే కాకుండా, ప్రజాస్వామ్య ప్రక్రియపై, ఓటు హక్కు ప్రాముఖ్యతపై ప్రాక్టికల్ అవగాహన కల్పించిన తక్షశిల స్కూల్ యాజమాన్యాన్ని, ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు విశేషంగా కొనియాడుతున్నారు." చిన్నతనంలోనే ఓటు హక్కు విలువ, బాధ్యతాయుతమైన నాయకుడిని ఎలా ఎన్నుకోవాలి అనే అంశాలపై ప్రత్యక్ష అనుభవం కల్పించడం నిజంగా అభినందనీయం. ఇలాంటి వినూత్న కార్యక్రమాలు రేపటి తరానికి ఎంతో ఉపయోగపడతాయనడంలో సందేహం లేదు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**ప్రజా వాయిస్, దౌల్తాబాద్, ఆగస్టు 11:** దౌల్తాబాద్ మండలం ముబారస్‌పూర్ గ్రామానికి చెందిన శేరిపల్లి యాదగిరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ కానుగుల విజయస్వామి మృతుని కుటుంబాన్ని పరామర్శించి, రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయస్వామి మాట్లాడుతూ యాదగిరి మృతి గ్రామానికి తీరని లోటని అన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి, అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాధిత కుటుంబానికి గ్రామస్తులు సైతం అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఈదుగాని యాదగిరి, గ్రామస్తులు పాల్గొన్నారు.



# అయోధ్య విరాళాల పై నిగ్గు తేల్చాలి

- విరాళాల, కానుకల చోరీ దోషులను కఠినంగా శిక్షించాలి
- తమ్మెర విశ్వేశ్వరరావు, సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు






**ప్రజా వాయిస్ తొర్రూర్, మహబూబాబాద్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రామాలయం పేరిట కోట్లాది రూపాయలు అక్రమ మార్గం పట్టించారని, బంగారం, టన్నులకొద్దీ వెండిని మాయం చేశారని, దేశబాపితంగా రామభక్తులు ఆందోళన చెందుతున్న, నోరు మెదపని ప్రధాని బాధ్యత వహించాలని తమ్మెర విశ్వేశ్వరరావు డిమాండ్ చేశారు.
దేశవ్యాప్తంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, ఈనెల ఆరో తేదీ నుంచి 14 వ తారీకు వరకు గ్రామ గ్రామాన కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రచారంచేసి, సెప్టెంబరు ఒకటో తారీకు నాడు చలో ఢిల్లీ కార్యక్రమాలని విజయవంతం చేయడంలో భాగంగా, నిన్న, ఈరోజు తొర్రూరు మండలంలోని గ్రామాలలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్రలు కొన సాగుతున్న సందర్భంలో, ముగింపుగా ఈ రోజు తొర్రూరు రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో పాదయాత్ర నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని తమ్మెర విశ్వేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్రాల్లో ఉన్న బిజెపి ప్రభుత్వం నీట్ పేపరు లీకు మీద, వేలాది మంది విద్యార్థులు ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర ధర్నా చేసిన సందర్భంలో, భాష్పవాయు గోళాలు, లాఠీ చార్జీలు చేసి చాలామంది విద్యార్థులను గాయపడిన సంఘటన మర్చిపోకముందే, జార్ఖండ్లోని ప్రభుత్వ నియామక పత్రాల పేపరుకూడా లీకు కావడం, అధికారంలో ఉన్న ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అని అన్నారు.
అలాగే వ్యవసాయ రంగాన్ని కుదేలు చేయడం కోసం, ఎన్నో సంవత్సరాలు పోరాడి, ఎంతోమంది కార్మికుల ప్రాణ త్యాగం చేసి సాధించుకున్న కార్మిక వర్గ హక్కులను కాలరాస్తూ, నాలుగు లేబర్ కోర్టులను తీసుకొని వచ్చి, కార్మిక వర్గం మీద ఉక్కు పాదం మోపుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా విమర్శిస్తూ ,లేబర్ కోర్టులను వెంటనే రద్దు చేయాలని ,మరొక్కసారి రైతు చట్టాలని ముందుకు తీసుకొని వస్తే తీవ్ర ప్రతిఘటన రైతుల ద్వారా ఉంటుందని హెచ్చరించారు. అలాగే రాష్ట్రంలో కూడా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఎన్నికల ముందర ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో కూడా, విఫలం చెందిందని అన్నారు .ముఖ్యంగా తొర్రూరు రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో విశ్రాంత ఉద్యోగస్తుల కొరకు ఏ.టి.ఓ ఆఫీసు ఏర్పాటు, ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయడం, 100 పడకల ఆసుపత్రి సత్వర నిర్మాణం చేయడంలో స్థానిక ఎమ్మెల్యే మరియు ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇప్పటికైనా ఈ రెవెన్యూ డివిజన్ అభివృద్ధిలో ముందు ఉండాలని కోరుకుంటూ, రోడ్డుకి రెండు పక్కల నిర్మించిన డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి, మురికి నీరు వెళ్లే మార్గం లేక షాపుల ముందర నీరు నిలువ ఉండి, మురుగువాసనతో రోగాలు వచ్చే పరిస్థితి దాపురించిందని, ఇప్పటికైనా స్థానిక మున్సిపల్ అధికారులు తగు చర్యలు తీసుకొని మురుగునీరు వెళ్లే ప్రయత్నం చేసి, డ్రైనేజీ వ్యవస్థను పటిష్టపరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు ఓమా బిక్షపతి, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి బందు మహేందర్, తొర్రూరు పట్టణ కార్యదర్శి ముద్దర బోయిన వెంకన్న, సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి గణపురం లక్ష్మను, పేర బోయిన కిరణ, హమాలీ నాయకులు నాయకులు సూరబోయిన వీరన్న, పసలాది యాకయ్య, మంగళంపల్లి చంద్రయ్య, దాసరి కృష్ణమూర్తి, వెలిశాల ప్రభాకరు తదితరులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్‌లో ఘనంగా "సఫాయి అప్నా భీమారీ భగావో" కార్యక్రమం

- పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత - 11వ వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ గౌడ్





**ప్రజా వాయిస్ హుస్నాబాద్ :** పట్టణ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హుస్నాబాద్ మున్సిపల్ 11వ వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ గౌడ్ సూచించారు. మంగళవారం హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో "సఫాయి అప్నా భీమారీ భగావో" (సాబ్) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై, కౌన్సిలర్లతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజలకు పరిశుభ్రత మరియు పరిసరాల స్వచ్ఛతపై అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ, ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. ముఖ్యంగా పాత టైర్లు, కుండలు, ఇతర వస్తువుల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చేతులను తరచుగా పరిశుభ్రంగా కడుక్కోవాలని, డయేరియా, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇంటి పరిసరాల్లో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని, ప్రజలు తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని విజ్ఞప్తి చేశారు. పరిశుభ్రతను దినచర్యలో భాగం చేసుకోవడం ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉండటంతో పాటు పట్టణాన్ని సుందరంగా, స్వచ్ఛంగా తీర్చిదిద్దవచ్చని ఆయన తెలిపారు.

## విద్యార్థులు చదువుతో పాటు సామాజిక స్పృహ అలవర్చుకోవాలి

- మోటివేషనల్ స్పీకర్ గంప నాగేశ్వరరావు



**ప్రజా వాయిస్, కోదాడ:** విద్యార్థులు తమ విద్యార్థి దశలో చదువుతో పాటు సామాజిక స్పృహ అలవర్చుకొని దేశం గర్వించే మంచి పౌరులుగా ఎదగాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ గంప నాగేశ్వర రావు అన్నారు. కోదాడ పట్టణంలోని ఎన్ ఆర్ ఎస్ ఇన్స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం పై నిర్వహించిన శిక్షణ, పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడిక తో మంచి పౌరులుగా తయారుకావాలని అన్నారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రతి ఒక విద్యార్థిలో అసమాన ప్రతిభ దాగి ఉంటుందని వాటిని సమయానుసారంగా ప్రదర్శించినపుడే విజయం వరిస్తుందని అన్నారు. విద్యార్థులకు ఎన్ ఆర్ ఎస్ విద్యాసంస్థలు అత్యుత్తమ సౌకర్యాలు కల్పిస్తున్నారని వాటిని సద్వినియోగం చేసుకొని విజేతలుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఆర్ఎస్ ఇన్స్టిట్యూషన్ చైర్మన్ వడ్డే రాజేష్ చౌదరి మాట్లాడుతూ తమ విద్యా సంస్థలలో చేరిన ప్రతీ ఒక్కరిపై ప్రత్యేక దృష్టి పెట్టి వారికి ఆసక్తి ఉన్న రంగాలలో నిష్ణాతులుగా తయారు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో భారతీ విద్యాసంస్థల కరస్పాండెంట్ కట్టా సత్తిరెడ్డి, ఎన్ ఆర్ ఎస్ ఇన్స్టిట్యూషన్ డైరెక్టర్ మనోహర్ రెడ్డి, కరస్పాండెంట్ వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ గంధం వెంకట రమణ ( జీ వీ), వైస్ ప్రిన్సిపల్ పీ ఎన్ ఆర్, పీ ఆర్ వో మల్లికార్జున రావు, పలువురు టీచర్లు, కాలేజ్ లెక్చరర్లు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## సారపాక ట్రాలీ ఆటో యూనియన్ నూతన కార్యవర్గం

- అధ్యక్షుడిగా గుర్రాల సుదర్శన్ ఏకగ్రీవ ఎన్నిక
- 45 మంది సభ్యులతో నూతన యూనియన్ ఏర్పాటు...
- భయట ఆటోలకు లోడింగ్ నిషేధం...
- సభ్యుల సంక్షేమానికి ఆర్థిక సహాయం...



**ప్రజా వాయిస్, బూర్గంపాడు :** బూర్గంపాడు మండలం, సారపాక పల్లె ప్రకృతి వనంలో బూర్గంపాడు మండల ట్రాలీ ఆటో యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యూనియన్‌కు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుర్రాల సుదర్శన్, ఉపాధ్యక్షుడిగా భూక్య సూర్యం, కార్యదర్శిగా రవి, జాయింట్ సెక్రటరీగా సోమనబోయిన రాంబాబు,కోశాధికారిగా జక్కంసత్యనారాయణ, ట్రెజరర్ కాటిబోయిన నాగరాజు ఎన్నుకున్నారు. యూనియన్‌లో మొత్తం 45 మంది సభ్యులు ఉన్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా యూనియన్ సభ్యుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బూర్గంపాడు మండల పరిధిలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ట్రాలీ ఆటోలు ఎలాంటి లోడింగ్ చేయరాదని తీర్మానించారు. నియన్‌లోని ఆటోలకు సీరియల్ ప్రకారం లోడింగ్ కేటాయించే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. దీంతో ప్రతి సభ్యుడికి సమానంగా లోడింగ్ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోనున్నారు.
యూనియన్ నియమ నిబంధనలను ప్రతి సభ్యుడు తప్పనిసరిగా పాటించాలని సమావేశంలో నిర్ణయించారు. నిబంధనలను ఉల్లంఘించి క్రమశిక్షణారాహిత్యంగా వ్యవహరించే సభ్యులపై యూనియన్ పరంగా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అలాగే యూనియన్ సభ్యత్వ ఫీజును రూ.500గా నిర్ణయించారు. ప్రతి సభ్యుడు ప్రతినెలా రూ.200 చొప్పున యూనియన్‌కు చెల్లించాలని తీర్మానించారు. ఈ మొత్తాన్ని యూనియన్ నిర్వహణతో పాటు సభ్యుల సంక్షేమానికి వినియోగించనున్నారు.
యూనియన్‌లోని 45 మంది సభ్యుల్లో ఎవరైనా అనారోగ్యానికి గురైనప్పుడు లేదా అనుకోని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పుడు యూనియన్ తరఫున ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించారు. సభ్యులకు అవసరమైన సమయంలో అండగా నిలిచే విధంగా యూనియన్ నిధులను వినియోగిస్తామని తెలిపారు.
ఈ సందర్భంగా అధ్యక్షుడు గుర్రాల సుదర్శన్ మాట్లాడుతూ, సభ్యులందరి సహకారంతో యూనియన్‌ను ఐక్యంగా, క్రమశిక్షణతో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ప్రతి నెల సభ్యులు చెల్లించే మొత్తాన్ని సక్రమంగా నిర్వహిస్తూ, యూనియన్‌లోని సభ్యులకు అనారోగ్యం లేదా ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పుడు వారి అవసరాలకు ఉపయోగపడే విధంగా వినియోగిస్తామని పేర్కొన్నారు. ట్రాలీ ఆటో డ్రైవర్ల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

## సర్వే ప్రక్రియలో రాష్ట్రంలో జనగామ జిల్లా ద్వితీయ స్థానం.. కీలకంగా నిలిచిన స్టేషన్ ఘనాపూర్

- సర్ నిబంధనలకు అనుగుణంగా సంబంధిత పత్రాలను కూడా సేకరించాలి.
- ముఖ్యంగా జనన తేదీ పుట్టిన స్థలం తల్లిదండ్రులు కుటుంబా వివరాలు సక్రమంగా పరిశీలించాలి.
- డిసిసి అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి




**ప్రజా వాయిస్, జనగామ జిల్లా ప్రతినిధి :** జనగామ, ఆగస్టు 11: జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం రఘునాథపల్లి మండలం నిడిగొండ లోని సత్యసాయి కన్వెన్షన్ హాల్‌లో ఈరోజు కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సర్ ప్రక్రియలో భాగంగా నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ నాయక్ హాజరై నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.
ఈ సందర్భంగా ధన్వంతి లక్ష్మీనారాయణ నాయక్ మాట్లాడుతూ, సర్ ప్రక్రియలో రాష్ట్రంలో జనగామ జిల్లా రెండవ స్థానంలో నిలవడానికి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం ఎంతో కీలకంగా నిలిచిందని అన్నారు. నియోజకవర్గంలో సర్ ప్రక్రియను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పట్టుదల, నాయకత్వం ఎంతో దోహదపడిందని తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, బి ఎల్ ఎలు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనిచేయడం వల్లే ఈ మంచి ఫలితాలు సాధ్యమయ్యాయని అన్నారు.
సర్ ప్రక్రియ రెండవ దశలో మరింత అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని ధన్వంతి లక్ష్మీనారాయణ నాయక్ సూచించారు. ముఖ్యంగా ప్రతి బూత్‌కు సంబంధించిన ఏ ఎస్ డి డి ఓటర్ల జాబితాను తీసుకొని, అందులో ఉన్న ప్రతి ఓటరిని క్షేత్రస్థాయిలో వెరిఫై చేయాలని అన్నారు. ఏ ఎస్ జి డి జాబితాలో ఒక ఓటరు పేరు ఎందుకు వచ్చిందో తెలుసుకొని, ఆ ఓటరు ప్రస్తుతం అదే చిరునామాలో నివసిస్తున్నారా లేదా, కుటుంబ సభ్యులు లేదా ఇంటివారి ద్వారా అవసరమైన సమాచారాన్ని సేకరించాలని సూచించారు. ఓటరు మరణించారా, శాశ్వతంగా ఇతర ప్రాంతానికి మారిపోయారా, డూప్లికేట్ ఓటరుగా ఉన్నారా లేదా ఇతర కారణాల వల్ల ఏ ఎస్ డి డి జాబితాలోకి వచ్చారా అనే విషయాలను క్షేత్రస్థాయిలో నిర్ధారించాలని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో సర్ నిబంధనలకు అనుగుణంగా సంబంధిత పత్రాలను కూడా సేకరించి, ఓటరు వివరాలను పూర్తిగా నిర్ధారించాలని అన్నారు. ముఖ్యంగా జనన తేదీ, జనన స్థలం, తల్లిదండ్రులు, కుటుంబ వివరాలు అవసరమైన సందర్భాల్లో సక్రమంగా పరిశీలించాలని సూచించారు.
ప్రతి బి ఎల్ ఎ తన పరిధిలోని ఏ ఎస్ డి డి ఓటర్ల వెరిఫికేషన్ స్థితిని ప్రతిరోజూ సంబంధిత కోఆర్డినేటర్‌కు నివేదించాలని, అక్కడి నుంచి డిసిసి స్థాయికి సమగ్ర సమాచారం అందేలా బి ఎల్ ఎ కోఆర్డినేటర్ డిసిసి సమన్వయంతో పనిచేయాలని ధన్వంతి లక్ష్మీనారాయణ నాయక్ తెలిపారు. పెండింగ్ కేసులు, అవసరమైన పత్రాలు సేకరించిన కేసులు, మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, డూప్లికేట్ కేసులు, గుర్తించలేని కేసులను స్పష్టంగా నమోదు చేసి నివేదించాలని సూచించారు. సర్ ప్రక్రియలో ఏ ఎస్ డి డి ఓటర్ల వెరిఫికేషన్ అత్యంత ముఖ్యమైన అంశమని, ప్రతి ఏ ఎస్ డి డి కేసును ఒక్కొక్కటిగా పరిశీలించి సరైన స్టేటస్‌ను నమోదు చేయాలని ఆమె అన్నారు. ధ్రువీకరించబడినది. పత్రము అవసరం వేరే ప్రాంతానికి మారిపోయినది. మరణించినది. నకిలీ మరియు డూప్లికేట్ ఆచూకీ లభించలేదు గుర్తించలేకపోయాము, వంటి వివరాలతో ప్రతి కేసును క్లియర్ చేయాలని, ఏ కేసును కూడా నిర్లక్ష్యంగా "తెలియదు" అనే స్థితిలో వదిలిపెట్టకుండా అవసరమైన ఫాలోఅప్ పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. జనగామ జిల్లా సర్ ( SIR) ప్రక్రియలో రాష్ట్రంలో రెండవ స్థానంలో ఉన్నందుకు కృషి చేసిన ప్రతి నాయకుడు, కార్యకర్త, బి ఎల్ ఎ మరియు కోఆర్డినేటర్‌కు ధన్వంతి లక్ష్మీనారాయణ నాయక్ గారు అభినందనలు తెలిపారు. ఇదే ఉత్సాహంతో రెండవ దశను కూడా సమర్థవంతంగా పూర్తి చేసి, జనగామ జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు.

## ప్రజల వద్దకే విద్యుత్ అధికారులు



**ప్రజా వాయిస్, దౌల్తాబాద్ :** ప్రజా బాట కార్యక్రమంలో భాగంగా విద్యుత్ శాఖ గజ్వేల్ డీఈ ఎ.స్వామి మంగళవారం సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలో పర్యటించారు.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు వారంలో రెండు రోజులు గ్రామాల్లో పర్యటించాలని నిర్ణయించిన ఆయన, ఏఈ శ్రీనివాసరావుతో కలిసి రాయపోల్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో పర్యటిస్తూ ప్రజల నుంచి విద్యుత్ సరఫరా, స్తంభాలు, లైన్లు తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఈ స్వామి మాట్లాడుతూ తమ పరిధిలో పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.తమ పరిధికి మించిన సమస్యలను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజలకు విద్యుత్ సేవల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాసాన్ పల్లి రాజు, ఉపసర్పంచ్ హమంతు రాజు, విద్యుత్ శాఖ అధికారులు శ్రీనివాస్ రావు,కర్ణకర్,ప్రవీణ్,ఆంజనేయులు,సత్తయ్య, వార్డు మెంబర్ ప్రభాకర్,నవీన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవం చెట్లు నాటే కార్యక్రమం లో సర్పంచ్ వంగ రాములు



**ప్రజా వాయిస్, బెల్లంపల్లి రూరల్ :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలములోని తాళ్ళగురిజాల గ్రామ పంచాయతీలో సర్పంచ్ వంగ రామన్న ఆధ్వర్యంలో వన మహోత్సవ భాగంగా ఘనంగా మొక్కలు నాటడం జరిగింది చెట్లు నాటడం వలన వర్షాలు పడటంతో పాటు వృక్ష సంపద ఎక్కువగా ఉంటుంది అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సురేష్, కార్యదర్శి వరప్రసాద్, వార్డు సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగినది.

## సింగరేణి ఉద్యోగులకు క్వార్టర్స్ కౌన్సిలింగ్



**ప్రజావాయిస్, ఇల్లందు ఆర్సీ:** సింగరేణి ఇల్లందు ఏరియా జియం వి.కృష్ణయ్య ఆదేశానుసారం మంగళవారం నాడు జనరల్ మేనేజర్ కార్యాలయం నందు సింగరేణి ఉద్యోగులకు క్వార్టర్ సిటైపు, జేకే, ఓల్డ్ కాలనీలో గల యస్డి టైపు క్వార్టర్ కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. ఈ కౌన్సిలింగ్ లో తాజా ఎలాట్మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ కొరకు ధరఖాస్తు చేసుకున్న అర్హులైన ఉద్యోగులకు క్వార్టర్లు కేటాయించారు. ఈ సందర్భముగా అడిషనల్ ఎస్ఓటు జీఎం, ఏరియా క్వాలిటీ మేనేజర్ రామదాస్ మాట్లాడుతూ..అర్హత కలిగినవారికి క్వార్టర్ అలాట్మెంట్ ఉత్తర్వులు జారిచేయబడతాయని అలాగే క్వార్టర్ ఎలాట్మెంట్ కమిటివారు పూర్తి పారదర్శకంగా ఎలాంటి సిఫార్సులకు తావులేకుండా నిబంధనలకు అనుగుణంగా క్వాటర్లు ఇవ్వడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజియం పర్సనల్ అజ్మీర తుకారాం, ఏరియా ఇంజనీరు లక్ష్మణ మూర్తి, సీనియర్ పర్సనల్ జి.సుధాకర్, జూనియర్ అసిస్టెంట్ జి.వీరన్న, తిరుపతి, జీఎం కార్యాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఫర్నిచర్ కొరత

- తక్షణ పరిష్కారం కోరిన టీఎస్టీడబ్ల్యుటీయూ



**ప్రజా వాయిస్, కాగజ్ నగర్/ఆసిఫాబాద్ :** గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ ట్రైబల్ వెల్ఫేర్ టీచర్స్ యూనియన్ (టీఎస్టీడబ్ల్యుటీయూ) డిమాండ్ చేసింది. గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సంతోష్ బి ఏంకు యూనియన్ వినతిపత్రం సమర్పించింది. ఆశ్రమ పాఠశాలల్లో ఫర్నిచర్ కొరత తీవ్రంగా ఉందని, ఉన్న ఫర్నిచర్ కూడా పాడైపోయిందని యూనియన్ తెలిపింది. దీంతో విద్యార్థులు, సిబ్బంది రోజువారీ విద్యా, పరిపాలనా కార్యకలాపాల్లో ఇబ్బందులు పడుతున్నారు. డ్యూయల్ డెస్కులు, టేబుళ్లు, కుర్చీలు, ల్యాబొరేటరీ టేబుళ్లు, భోజనశాల టేబుళ్లు–బెంచీలు, గ్రంథాలయ టేబుళ్లు–కుర్చీలు, నోటీస్ బోర్డులు, వసతి గృహ మంచాలు తక్షణమే మంజూరు చేసి సరఫరా చేయాలని కోరింది. పాఠశాల విద్యాశాఖ తరహాలో ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అంతర్జాతీయ విద్యా ఎక్స్‌పోజర్ పర్యటనలకు అవకాశం కల్పించాలని కూడా యూనియన్ కోరింది. దీనివల్ల ఆధునిక బోధనా పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానంపై ఉపాధ్యాయులకు అవగాహన పెరిగి, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే అవకాశం ఏర్పడుతుంది. అర్హులైన ఉపాధ్యాయులను ఎంపిక చేసి, బడ్జెట్ లభ్యతకు అనుగుణంగా విదేశీ విద్యా పర్యటనలకు పంపేందుకు మార్గదర్శకాలు రూపొందించాలని కూడా విజ్ఞప్తి చేసింది.యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గుగ్లోత్ రాములు నాయక్, ప్రధాన కార్యదర్శి జి అశోక్ ఈ డిమాండ్లు చేశారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా

- పటాన్చెరు టియుడబ్ల్యూజే- ఐజెయు నూతన అధ్యక్షులు పత్తి నరసింహ
- అక్రిడేషన్లు, బస్సుపాస్ లు ఇప్పించిన ఘనత
- టీయూడబ్ల్యూజే–ఐజేయూ దిక్రమశిక్షణ గల సంఘం మనది
- ఐజేయూ జాతీయ సమావేశంలో సంగారెడ్డి జిల్లాకు మంచి పేరు
- ఐజేయు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఏ ఫైజల్



**ప్రజావాయిస్ , పటాన్ చెరువు :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం అందరం కలిసి కట్టుగా సంఘటితంగా పనిచేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్టు–ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఏ ఫైజల్ అన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం TUWJ–IJU విస్తృత స్థాయి సమావేశాన్ని రామచంద్రాపురం లోని లక్ష్మి గార్డెన్ లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఉపాధ్యక్షులు ఫైజల్ మాట్లాడుతూ 70ఏళ్ల చరిత్ర ఉన్న యూనియన్ టీయూడబ్ల్యూజే–ఐజేయూ లో క్రమశిక్షణకు మారుపేరులాంటిందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు బస్సు పాస్ సౌకర్యం కల్పించడంలో టీయూడబ్ల్యూజే–ఐజేయూ పాత్ర మరవలేనిదని చెప్పారు. జిల్లాలో అర్హులైన ప్రతీ జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులను ఇప్పించడం జరుగుతుందని అన్నారు. జర్నలిస్టుల అరోగ్య భద్రత, హక్కుల పరిరక్షణకు పాటుపడుతుందన్నారు. నియమనిబంధనలతో సంఘం పనిచేస్తుందని చెప్పారు. సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ మన సంఘంలో ప్రతి జర్నలిస్టుకు గౌరవం దక్కుతుందన్నారు. జర్నలిస్టుల గౌరవం, భద్రత, హక్కుల విషయంలో అవసరమైనప్పుడు సంఘటితంగా గొంతెత్తాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ మాట్లాడుతూ పటాన్ చెరు జర్నలిస్టుల సమిష్టి కృషితోనే అంచలంచలుగా జిల్లా స్థాయికి ఎదిగానని చెప్పారు. ఇక్కడి జర్నలిస్టులకు రుణపడి ఉంటానంటూ సభావేదిక ద్వారా పాదాబివందనం చేస్తున్నట్లు తెలిపారు. సంఘం బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు. టీయూడబ్ల్యూజే–ఐజేయూ ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి చెన్న బసవేశ్వర్ అధ్యక్షత వహించిన సమావేశంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు ఆసీఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాథ్, జిల్లా జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా జాయింట్ సెక్రటరీ భూపాల్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్, ఈసీ మెంబర్లు మజీద్, శ్రీనివాస్, ఫోటో గ్రాఫర్ జిల్లా అధ్యక్షుడు ఆరీఫ్, చిన్న,మధ్య తరహా పేపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్దిఖ్, జనరల్ సెక్రటరీ ఈశ్వర్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పటాన్‌చెరు నియోజకవర్గం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

**పటాన్ చెరు అసెంబ్లీ టీయూడబ్ల్యూజే–ఐజేయూ నూతన కార్యవర్గం**

నూతన అధ్యక్షునిగా పత్తి నర్సింహా, ప్రధానకార్యదర్శిగా యాదగిరి, సలహాదారులుగా కాశీపతి, సులేమాన్,రామారావు, ఉపాధ్యక్షులు గా విఠల్, నగేష్, శివకుమార్, జెమిని రాజు, రమేష్, జీవరత్నం, జాయింట్ సెక్రటరీలుగా వేణు, ప్రభాకర్, శ్రీనివాస్, కోటేష్, శివాజీ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఆంజనేయులు, గాండ్ల మహేష్, వివేక్, రాజు, కోశాధికారిగా శ్రీనివాస్ రెడ్డి, ఈసీ మెంబర్లు గా శ్రీనివాస్, శంకర్, శేఖర్, మహేందర్ గౌడ్, సిద్దు, శ్రీనివాస్ మామా, రాజశేఖర్, ప్రదీప్ రెడ్డి, విజయ్, నాయుడు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరికి రాష్ట్ర, జిల్లా నాయకులు, తోటి జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలిపి అభినందనలు తెలిపారు.

## శ్రీ మహంకాళి ఆలయ ఉత్సవాలకు స్థానిక సర్పంచ్ సొంత నిధులు 4,50000 వేలు



**ప్రజా వాయిస్, చేగుంట :** చేగుంట పట్టణ కేంద్రంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ మహాకాళి దేవాలయం ఉత్సవాలకు చేగుంట సర్పంచ్ స్రవంతి సతీష్,ఆలయ ఉత్సవాలకు 4,50,000 వరకు తన సొంత నిధులు ఖర్చు చేశారు, ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు, అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ ఉసికె శ్రీనివాస్ మాట్లాడుతూ ఆషాడ మాస ఉత్సవాల్లో భాగంగా చేగుంట మండల కేంద్రంలోని శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయ ఉత్సవాలను మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించడం జరిగిందని మూడు రోజులపాటు కొనసాగిన ఉత్సవాలకు సంబంధించి సుమారు నాలుగు లక్షల 50 వేల వరకు స్థానిక సర్పంచ్ స్రవంతి సతీష్ కుటుంబం ఆర్థిక సహకారంతో కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు, ప్రగతి సంవత్సరం సర్పంచ్ కుటుంబం ఇలాంటి సేవా కార్యక్రమాలకు ముందుంటూ ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని అమ్మవారి కృపా కటాక్షాలు ఆ కుటుంబం పై ఎల్లవేళలా ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ తో పాటు సంద్రుగు సతీష్, గడ్డమీది బాలేష్, ఉదయ్ భాస్కర్, సంద్రుగు స్వామి, సిద్దిరాములు, సత్యనారాయణ, రవి, రఘుపతి, తదితరులు పాల్గొన్నారు.

## సొంత ఖర్చులతో జిల్లా లైబ్రరీకి 30 వేల పుస్తకాలు వితరణ చేసిన చైర్మన్

- భావితరాల విజ్ఞానం కోసం పుస్తకాన్ని మించిన సాధనం లేదు
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి



**ప్రజా వాయిస్ , మహబూబాబాద్ :** జిల్లా కేంద్ర గ్రంథాలయానికి, జిల్లా గ్రంథాలయ పాఠకులు పోటీ పరీక్షల సంబంధించిన పుస్తకాలు పాఠకుల సౌకర్యార్థం కోసం ప్రతి చదువరికి పుస్తకం ఉండాలని తలంపుతో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి

తన సొంత ఖర్చులతో 30 వేల రూపాయల కాంపిటీటివ్ ఎగ్జామ్స్ సంబంధించిన గ్రూప్ వన్, గ్రూప్ టు ,ఎస్సై , కానిస్టేబుల్స్ ,బ్యాంకు, జూనియర్ లైన్ మెన్, అట్లాస్ ఇండియన్ పాలిటి, తెలంగాణ చరిత్ర ,భారత చరిత్ర , ఇంకా అనేక పుస్తకాలు, జిల్లా కేంద్ర గ్రంథాలయానికి వితరణ చేశారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మనకు తెలియని ప్రపంచాన్ని మనకు చూపించి మన నడవడిక ఆలోచనలు సక్రమార్గంలో పయనించడానికి భావితరల విజ్ఞానం కోసం పుస్తకానికి మించిన సాధనం ఏది లేదని , కాబట్టి ప్రతి పాఠకుడు ఈ కాంపిటీటివ్ పుస్తకాలను వినియోగించుకొని పోటీ పరీక్షల్లో విజేతలై తల్లిదండ్రుల ఆశయాలు నెరవేరుస్తూ, సమాజాభివృద్ధికి దోహదపడాలని కోరారు. అనంతరం గ్రంథాలయ పాఠకులు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఔదార్యానికి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు ,జి విజేందర్ ,రుద్రారపు వీరేందర్, మరియు నరసింగం శ్రీనివాస్, మందుల రఘు,భూలక్ష్మి యాదమ్మ గ్రంథాలయ పాఠకులు గోపాల్ ,నవీన్,సురేష్ ప్రవల్లిక ,జ్యోతి , శారద తదితరులు పాల్గొన్నారు

## కుష్టు వ్యాధి నివరణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నోడల్ పర్సన్ లతో సమీక్ష సమావేశం

- కుష్టు వ్యాధి రహిత మహబూబాబాద్ జిల్లాను ముందంజలో ఉంచాలి.
- కుష్టు వ్యాధి లక్షణాలు మొద్దు బారిన మచ్చ రాగి రంగులో ఉంటుంది.

**ప్రజా వాయిస్, మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ, కుష్టు వ్యాధి రహిత మహబూబాబాద్ జిల్లాను ముందంజలో ఉంచాలని, జిల్లాలో గల కుష్టి వ్యాధిగ్రస్తులకు79 మందికి చికిత్స మరియు మందులు అందించడం జరుగుతుంది. కుష్టు వ్యాధి లక్షణాలు మొద్దు బారిన మచ్చ రాగి రంగులో ఉంటాయని, స్పర్శ లేకుండా ఉంటుందని, మచ్చ పైన వెంట్రుకలు రావడం, మచ్చ పైన చెమట రాకుండా ఉండడం, పొడిబారిన మచ్చ శరీరంపై ఈ లక్షణాలు గల మచ్చలు ఉన్నట్లయితే అనుమానితులుగా భావించి దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారికి పరీక్ష కొరకై పంపించవలసిందిగా అవగాహన కల్పిస్తూ, ఉచితంగా మందులు అందజేయబడతాయని తెలియజేస్తూ, కుష్టు వ్యాధి రహిత జిల్లా చెయ్యాలని ఈ సందర్భంగా నోడల్ పర్సన్ లకు, సూపర్వైజర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో కుష్టు వ్యాధి ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ అర్జున్ , డీపీఎంవోలు సతీష్ రెడ్డి, వాలియా, డిప్యూటి డెమో రాజకుమార్ మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర కుష్టు వ్యాధి నోడల్ పర్సన్లు పాల్గొన్నారు.



# ఆర్టీఐ అమలుకు మరింత పదును

- జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలి
- కలెక్టర్, ఎస్పీలకు సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వినతి



**ప్రజా వాయిస్, వికారాబాద్:** ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం మరింత పెంపొందించేందుకు సమాచార హక్కు చట్టం–2005ను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని, ఇందుకోసం ప్రత్యేకంగా జిల్లా స్థాయి ఆర్టీఐ కమిటీని ఏర్పాటు చేసి అధికారిక గుర్తింపు కల్పించాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ సభ్యులు కోరారు.

మంగళవారం సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఆదేశాల మేరకు వికారాబాద్ జిల్లా కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రాలను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సమాచారాన్ని సులభంగా అందుబాటులోకి తీసుకురావడంలో సమాచార హక్కు చట్టం కీలకమైన సాధనమని పేర్కొన్నారు. జిల్లాలో ఆర్టీఐ చట్టం అమలును మరింత పటిష్ఠం చేసేందుకు ఆర్టీఐ మానిటరింగ్ మెంబర్స్ వ్యవస్థను పునరుద్ధరించాలని, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక ఆర్టీఐ సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

**ప్రజల్లో అవగాహనకు విస్తృత కార్యక్రమాలు**

సమాచార హక్కు చట్టంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు, శిక్షణా శిబిరాలు నిర్వహించాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో ఆర్టీఐ పుస్తకాలు, కరపత్రాలు, పోస్టర్లు, డిజిటల్ సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా సమాచార హక్కు చట్టం అమలులో విశేష సేవలందిస్తున్న అధికారులు, ప్రభుత్వ శాఖలు, ఆర్టీఐ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం జిల్లా స్థాయి ఆర్టీఐ పురస్కారాలు అందించాలని కోరారు.

**రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలి**

జిల్లా స్థాయి ఆర్టీఐ కమిటీ ఏర్పాటుతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ, తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌కు జిల్లా కలెక్టర్ లేఖ రాసి కమిటీ ప్రతిపాదనలను సిఫారసు చేయాలని కోరారు. రాష్ట్ర స్థాయి ఆర్టీఐ కమిటీలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీకి 33 స్థానాలు కేటాయించాలని, ప్రతి జిల్లా ఆర్టీఐ కమిటీలో కనీసం ముగ్గురు సభ్యులకు అధికారిక ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో నిర్వహించే ఆర్టీఐ అవగాహన కార్యక్రమాలు, శిక్షణా శిబిరాలు, ప్రజా చైతన్య కార్యక్రమాల్లో తమ కమిటీని అధికారిక భాగస్వామ్య సంస్థగా గుర్తించి సహకరించాలని కోరారు. ప్రభుత్వ సమాచారాన్ని ప్రజలకు మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావడం, సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా పారదర్శక పాలనకు మరింత బలం చేకూరుతుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. తమ వినతులపై అధికారులు సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ సభ్యులు మహమ్మద్ గౌస్, గుజ్జరి మహేందర్, మర్పల్లి ప్రభాకర్, దుర్గం చెరువు గోపాల్, మ్యాతరి రవి, పాతులోత్ పెంట్యా, మోతే అశోక్, తలారి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలి

- ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత సూచన



**ప్రజా వాయిస్, ఆసిఫాబాద్ :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఇటీవలి వర్షాలతో జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రైతులు వరి నాట్లు వేస్తున్నట్లు వివరించారు.

ఎల్‌నినో ప్రభావం ఈ ఏడాదితో పాటు వచ్చే ఏడాది వరకు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ నిపుణుల హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. బోరుబావులు ఉన్న రైతులు కూడా వరి సాగుకు నీరు అందుబాటులో ఉంటుందా అని ఆలోచించుకోవాలని కోరారు. జిల్లాలో వర్షపాతం మెరుగ్గా ఉన్నా వరి సాగుకు సరిపడా నీటి లభ్యత ఉండకపోవచ్చని తెలిపారు. రైతుల సంక్షేమం దృష్టిలో ఉంచుకుని అవగాహన కల్పిస్తున్నామని, ఆరుతడి పంటలు సాగు చేసి అధిక దిగుబడులు, లాభాలు పొందాలని కోరారు.

**15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**

రాష్ట్ర ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులకు అందజేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఈ నెల 15 నుంచి ప్రారంభం కానుంది. మండల, గ్రామస్థాయిలో ప్రణాళికాబద్ధంగా కార్డుల పంపిణీకి చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నారు. రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై నిఘా ఏర్పాటు చేశారు. ఎక్కడైనా అక్రమ తరలింపు గమనిస్తే అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఆశ్రమ పాఠశాలల్లో డీడీ జాదవ్ అంబాజీ ఆకస్మిక తనిఖీ

- నిర్లక్ష్యంపై హెచ్చరిక




**ప్రజా వాయిస్, కొమురం భీమ్ ఆసిఫాబాద్ :** కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని ఫరిదీ ప్రాంతంలోని మొఘడ్‌ధగడ్, బాబాపూర్ ఆశ్రమ పాఠశాలలను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.విద్యార్థులకు అందుతున్న భోజనం నాణ్యత, ఆరోగ్య పరిస్థితులు, విద్యా బోధన, పరిసరాల పరిశుభ్రత, వసతి సౌకర్యాలను సమగ్రంగా పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి సౌకర్యాలు, భోజనం, బోధనపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. సిబ్బంది, ఏఎన్ఎం విధుల నిర్వహణ, ఆరోగ్య పరిరక్షణ చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.విద్యార్థుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వారి ఆరోగ్యం, భద్రత, విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భోజనం, ఆరోగ్య పరిరక్షణ, బోధనలో నిర్లక్ష్యం సహించేది లేదని, నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆశ్రమ పాఠశాలల్లో మెరుగైన వసతి, నాణ్యమైన విద్య, ఆరోగ్యకరమైన

## మైలారం గ్రామానికి ప్రత్యేక విద్యుత్ లైన్ ప్రారంభం..



- మైలారం గ్రామ అభివృద్ధికి అవసరమైన మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తాం.
- రైతులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం తగ్గించి మరింత మెరుగైన సేవలు అందుతాయి.
- 24 గంటల నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యం:
- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**ప్రజా వాయిస్, పాలకుర్తి :** పాలకుర్తి నియోజకవర్గం లోని రాయపర్తి మండలం మైలారం గ్రామ ప్రజల విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. గ్రామానికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు రూ.9 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ప్రత్యేక విద్యుత్ లైన్‌ను పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి విద్యుత్ శాఖ అధికారులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మైలారం గ్రామంలోని విద్యుత్ ఉపకేంద్రం నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ విద్యుత్ లైన్ ద్వారా గ్రామానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు చేపట్టారు. ప్రత్యేక విద్యుత్ లైన్ అందుబాటులోకి రావడంతో గ్రామ ప్రజలకు, రైతులకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గి మరింత మెరుగైన సేవలు అందనున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మైలారం గ్రామానికి ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటు చేయడం ద్వారా 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాకు మార్గం సుగమమైందని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.
మైలారం గ్రామ అభివృద్ధికి అవసరమైన మరిన్ని మౌలిక వసతులను దశలవారీగా కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక సర్పంచ్ చిర్రా వేణు, మండల ముఖ్య నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు

- మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుంది.
- మహిళలను కోటేశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యం.
- మహిళలు అభివృద్ధి చెందితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది.
- ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు



**ప్రజా వాయిస్, హనుమకొండ జిల్లా ప్రతినిధి :** మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు.మంగళవారం 3వ డివిజన్ లోని మహిళలకు అరెపల్లిలోని వికె గార్డెన్స్ లో ఇందిర మహిళా శక్తి చీరాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని తెలిపారు. మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.గత ప్రభుత్వం అందించిన బతుకమ్మ చీరల్లో నాణ్యత లోపం ఉండడంతో ఆడపడుచులు వాటిని ఉపయోగించలేకపోయారనీమన కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మంచి నాణ్యతతో కూడిన, ఉపయోగపడే చీరలను తయారు చేయించి మహిళలకు అందిస్తుందన్నారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ నాణ్యతతో కూడిన కానుకను అందజేస్తుందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు.మహిళలు అభివృద్ధి చెందితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అరుణకర్,మాజీ కార్పొరేటర్ జన్ను అనిల్ శిభారాణి,సొసైటీ చైర్మెన్ బుద్దే పెద్దన్న,సీనియర్ నాయకులు అభిషేకం,సంపత్,సుధాకర్,రవికుమార్,నాయకులు,కార్యకర్తలు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ - కరీంనగర్ రహదారిపై తొలగిన డ్రైనేజీ సమస్య

- స్వంత ఖర్చులతో హై ప్రెషర్ యంత్రాన్ని తెప్పించిన కాంగ్రెస్ నాయకుడు గడ్డం శివరాం ప్రసాద్
- సమస్య పరిష్కారానికి చొరవ చూపిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**ప్రజా వాయిస్/కాకతీయ యూనివర్సిటీ/హనుమకొండ జిల్లా ప్రతినిధి :** వరంగల్ – కరీంనగర్ జాతీయ రహదారి మధ్యలో ఉండే డ్రైనేజ్ మరియు రోడ్డు పక్కన ఉన్న గడ్డం రామకృష్ణయ్య కాలనీ (GWMC) గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ కార్పొరేషన్ 55వ డివిజన్ – భీమారం) డ్రైనేజీ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. గత 10 రోజులుగా హైవేకు మధ్యలో ఉండే డ్రైనేజీలో ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలు పేరుకుపోవడంతో ఇరువైపుల ఉండే డ్రైనేజ్ లో మురుగునీరు నిలిచిపోయి, తీవ్ర దుర్వాసనతో పాటు దోమలు, ఈగల బెడద పెరిగింది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణి

**ప్రజా వాయిస్, దోమకొండ :** పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు కళ్యాణ లక్ష్మి –షాదీ ముబారక్ పథకాలు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. దోమకొండ రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 35 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో దోమకొండ మండలం తాసిల్దార్ మరియు సిబ్బంది, బిజెపి దోమకొండ మండల అధ్యక్షులు మద్దురి భూపాల్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన సిద్ధిరాములు మాజీ మండల అధ్యక్షులు చింతల రాజేష్, బీజేవైఎం మండల అధ్యక్షులు కంది మనోజ్, తిప్పపురం రవి, నరేందర్ రెడ్డి, సాయబుగారి నర్సింలు, చింతల నర్సింలు, కొండల్ రెడ్డి, బిజెపి కార్యకర్తలు మరియు బీజేవైఎం కార్యకర్తలు ప్రజాప్రతినిధులు, పోలీస్ శాఖ, ఇతర శాఖ అధికారులు, లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.




# టైర్ల కంపెనీల కాలుష్యంపై గ్రామస్తుల ఆందోళన

- జిల్లా కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలి: గ్రామస్తులు
- N&N టైర్ల కంపెనీతో పాటు ఇతర కంపెనీలను మూసివేయాలి
- దుర్వాసన, కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమా ?



**బొమ్మలరామారం మండలం/ప్రజా వాయిస్:**
యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలోని రంగాపురం గ్రామానికి అతి సమీపంలో కొనసాగుతున్న N&N టైర్ల కంపెనీతో పాటు పక్కనే ఉన్న ఇతర టైర్ల కంపెనీలను మూసివేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గ్రామస్తులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. రంగాపురం, పెద్ద పర్వతాపురం, బొమ్మలరామారం గ్రామాలకు చెందిన ప్రజలు కంపెనీ ఎదుట ఆందోళన చేపట్టారు.
కంపెనీల నుంచి వెలువడుతున్న దుర్వాసన, కాలుష్యం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దుర్వాసన కారణంగా ఊపిరి తీసుకోవడం కూడా కష్టంగా మారిందని, ముఖ్యంగా చిన్నారులు, గర్భిణీ స్త్రీలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తరచూ జలుబు, అలర్జీ వంటి సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. గ్రామస్తుల ఆందోళనకు మద్దతుగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్న కాలుష్యంపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
కాలుష్యంపై కాలుష్య నియంత్రణ మండలి (PCB) అధికారులు నిర్వహిస్తున్న విచారణ తీరుపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేశారు. సరైన స్థాయిలో విచారణ జరగడం లేదని, తప్పుడు ఎంక్వైరీలతో సమస్యను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు.
జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా స్పందించి టైర్ల కంపెనీల కాలుష్యంపై సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవ పరిస్థితులను పరిశీలించి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేలా కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.
కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యాలతో చెలగాటమాడే విధంగా పరిశ్రమలు కొనసాగితే మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో సర్పంచులు యాంజాల గణేష్, కట్ట శ్రీకాంత్, ఈగల బాల్ రాజు, ప్రజా సంఘాల నాయకులు మైలారం జంగయ్య, బీఆర్ఎస్, బీజేపీ, అధ్యక్షులు , పోలగౌని వెంకటేష్ గౌడ్, వినోద్ సీపీఐ మండల కార్యదర్శి పోలగౌని వెంకటేష్ గౌడ్, వినోద్, అన్నెమోయిన వెంకటేష్, గూదె బాల నర్సింహా, మాజీ ఎంపీటీసీ సభ్యులు మైలారం రామకృష్ణ, పక్కీరు రాజేందర్ రెడ్డి, బేతాళ శ్రీనివాస్, ధీరావత్ రమేష్, మూడు గ్రామాల వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కుల సాధన కోసం ఉద్యమించాలి

- సమిష్టిగా ఉండి... సమస్యలపై పోరాడాలి
- ఇండ్ల స్థలాలు ఇండ్లు సాధించుకోవాలి
- జర్నలిస్టుల సంక్షేమమే టి యు డబ్ల్యూజె ( ఐజేయు) ప్రధాన లక్ష్యం
- జిల్లా అధ్యక్షులు చిత్తనూరి శ్రీనివాస్



**ప్రజా వాయిస్ , గూడూరు :** జర్నలిస్టుల హక్కుల సాధన కోసం ఉద్యమించాలనీ, సమిష్టిగా ఉండి... సమస్యలపై పోరాడి ఇండ్ల స్థలాలు, ఇండ్లు సాధించుకోవాలనీ,జర్నలిస్టుల సంక్షేమమే టీయూడబ్ల్యూజె (ఐజేయు) ప్రధాన లక్ష్యం అని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షులు చిత్తనూరి శ్రీనివాస్ అన్నారు. గూడూరు మండలం వట్టివాగు సమ్మక్క –సారలమ్మల వనదేవతల ప్రాగాణంలో టియు డబ్ల్యూజె( ఐజేయు) మండల కమిటీ సమావేశం, సంఘ సభ్యత నమోదు కార్యక్రమం మండల అధ్యక్షులు గుర్రపు యాకాంబ్రం అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు చిత్తనూరి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ఉద్యమాలలో జర్నలిస్టులు కీలక భూమిక పోషించారని అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా జర్నలిస్టులకు జర్నలిస్టుల బతుకులు మారలేదన్నారు . జర్నలిస్టులకు జీతభత్యాలు లేకుండా 24 గంటలు నిద్రాహారాలు మాని ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తూ పనిచేస్తున్నారన్నారని పేర్కొన్నారు. జర్నలిస్టులు ఆర్థికంగా అభివృద్ధి చెందడం లేదని , జర్నలిస్టులకు ఆరోగ్య భద్రత లేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు మరణిస్తే వారి కుటుంబానికి మీడియా అకాడమీ నుండి లక్ష రూపాయలు అందించి ఆదుకుంటున్నట్లు తెలిపారు.మృతిచెందిన జర్నలిస్టు భార్యకు రూ,3వేల పెన్షన్ అందిస్తున్నారని చెప్పారు. అక్రిడేషన్ ఉన్న ప్రతి జర్నలిస్టుకు హెల్త్ కార్డ్ అందించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అర్హులైన జర్నలిస్టులకు నివాస స్థలాలను సంబంధించి పాలసీ ప్రకటించి ఇండ్ల స్థలాలు కేటాయించి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టు సమస్యల సాధన కోసం జర్నలిస్టులందరూ సమిష్టిగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైంద న్నారు.జర్నలిస్టుల హక్కులు సాధించేవరకు పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. టి యుడబ్ల్యూజె ( ఐజేయు) సభ్యులంతా సమన్వయంతో సమిష్టిగా ఉండాలని, జర్నలిస్టుల సమస్యలపై పోరాడాలని సూచించారు. సభ్యులు యూనియన్ నియమ నిబంధనలకు లోబడి పని చేయాలని, అదే విధంగా బాధ్యతతో వ్యవహరించి స్థానిక జర్నలిస్టుల సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. అందరూ ఐక్యతతో హక్కుల సాధనకు కృషి చేయాలని కోరారు. సమన్వయంతో పని చేసి సంఘాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టియుడబ్ల్యూజె ( ఐజేయు ) జిల్లా ప్రధాన కార్యదర్శి గాడిపెల్లి శ్రీహరి, మండల అధ్యక్షులు గుర్రపు యాకాంబ్రం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గంధసిరి రవి, ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ( టిడబ్ల్యూజెఏ) జిల్లా అధ్యక్షులు బానోత్ లక్ష్మణ్ నాయక్, టీయూడబ్ల్యూజె ( ఐజేయు) జిల్లా ఉపాధ్యక్షులు ఉమగాని మధు, ముక్తవరం సత్యనారాయణ, కోరే పాపయ్య, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల రంగ, జిల్లా సహాయ కార్యదర్శి రావూరి ప్రశాంత్, జిల్లా కమిటీ సభ్యులు పానుగంటి శ్రీనివాస్, రాయపురం సంపత్, బిక్షపతి,భరత్, శ్రీనివాస్, సురేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# తూముకుంట పెద్దవాగులో అక్రమ ఇసుక దందా ?

- రాజకీయ అండదండలతోనే ఇసుక దందా నడుస్తుందా ?
- జేసీబీలతో ఇసుక తవ్వకాలు ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుక తరలింపు, పట్టించుకోని మండల రెవెన్యూ అధికారులు
- అధికారులకు ఏమైనా ముడుపులు ముట్టాయా ?
- ఇంత జరుగుతున్న చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- రైతుల పొలాలకు నీరు అందక భూగర్భ జలాలు అడుగంటిపోయాయి
- మా గోడును పట్టించుకునే అధికారి ఎవరు? రైతుల ఆవేదన







**ప్రజా వాయిస్, వనపర్తి :** వనపర్తి జిల్లాపీపనగండ్ల మండల పరిధిలోని తూముకుంట పెద్దవాగులో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా జోరుగా సాగుతున్నాయని వాగు పరివాహక ప్రాంత రైతులు ఆరోపిస్తున్నారు. జేసీబీల సహాయంతో ఇసుకను తోడుతూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పేరుతో అక్రమంగా తరలిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. రైతు పొలాలకు నీరు అందక భూగర్భ జలాలు అడుగంటిపోయాయని మోటార్లకు నీళ్లు అందడం లేదని రైతులు అన్నారు.అలాగే ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ పేరుతో ఆఫ్‌లైన్‌లో ఇసుక దందా కొనసాగుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా తరలించడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని వారు పేర్కొన్నారు. అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**ఇసుక రాసులు రాసులుగా నిండిపోయిన వాగు**

తూముకుంట పెద్దవాగులో జేసీబీల సహాయంతో విచ్చలవిడిగా ఇసుకను తవ్వి, రాశులు రాశులుగా ఇసుక కుప్పలు ఏర్పాటు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పెద్దఎత్తున ఇసుక తవ్వకాలు, నిల్వలు, అక్రమ రవాణా జరుగుతున్నప్పటికీ మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను రైతులు అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే, కొందరు ట్రాక్టర్ యజమానులు తమపై ఎదురుదాడికి దిగుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో వాగు పరివాహక ప్రాంత రైతులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు.

**రైతుల పొలాల్లో రోడ్లు వేసి**

ఇసుకను తరలించేందుకు స్థానిక రైతుల పొలాల్లో మొరం, మట్టిని పోసి రహదారులుగా మార్చుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తమ పొలాలకు నష్టం కలుగుతోందని, పంటల సాగుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.తమ పొలాల్లో ఏర్పాటు చేసిన అనధికారిక బాటలను వెంటనే తొలగించి, ఇసుక వాహనాల రాకపోకలను నిలిపివేయాలని కోరుతున్నారు.ఈ విషయంపై పలుమార్లు పోలీసు అధికారులు, స్థానిక తహసీల్దార్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదులు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని వాగు పరివాహక ప్రాంత రైతులు వాపోతున్నారు.

**రాజకీయ అండదండలతోనేనా?**

అక్రమ ఇసుక రవాణాకు కొందరు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.అధికారులు తక్షణమే స్పందించి తూముకుంట పెద్దవాగులో జరుగుతున్న ఇసుక తవ్వకాలు, రవాణాపై సమగ్ర విచారణ చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని, అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న వాహనాలను అడ్డుకోవాలని వారు కోరుతున్నారు.తమ పొలాల మీదుగా ఇసుక రవాణా కోసం ఏర్పాటు చేసిన బాటలను వెంటనే నిలిపివేయాలని అధికారులను రైతులు కోరుతున్నారు.

# రాజేంద్రనగర్ జోన్‌లో మాన్సూన్ డ్రైవ్‌కు శ్రీకారం

- 29 వార్డుల్లో దశలవారీగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు
- 54 మెట్రిక్ టన్నుల వ్యర్థాల తొలగింపు
- ముంపు, దోమల నివారణపై ప్రత్యేక దృష్టి
- జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి




**ప్రజావాయిస్/రాజేంద్రనగర్:** వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రాజేంద్రనగర్ జోన్‌లో ప్రత్యేక మాన్సూన్ డ్రైవ్ చేపట్టినట్లు జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వీ.కర్ణన్ ఆదేశాల మేరకు జోన్‌లోని ఆరు సర్కిళ్ల పరిధిలోని 29 వార్డుల్లో ఈ నెల 21 వరకు దశలవారీగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.మాన్సూన్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం 54 మెట్రిక్ టన్నుల సాధారణ వ్యర్థాలు, 18.5 మెట్రిక్ టన్నుల సీ అండ్ డీ వ్యర్థాలను తొలగించినట్లు తెలిపారు.నిర్లక్ష్యంగా వదిలేసిన రెండు వాహనాల తొలగింపునకు నోటీసులు జారీ చేయడంతో పాటు 52 గృహాలను స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్త సేకరణకు అనుసంధానించామన్నారు. అక్రమంగా సీ అండ్ డీ వ్యర్థాలను డంపింగ్ చేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.12 గేటెడ్ కమ్యూనిటీలు,హైరైజ్ భవనాల్లో వర్షపు నీటి పారుదల వ్యవస్థ, పిట్‌హోల్స్ పనితీరుపై సర్వే నిర్వహించినట్లు కమిషనర్ తెలిపారు.ఇంజినీరింగ్ విభాగం 29 రోడ్డు గుంతలను పూడ్చి,28 ఇంకుడు గుంతలను శుభ్రం చేసి, 1.5 మెట్రిక్ టన్నుల సిల్ట్, ఫ్లోటింగ్ మెటీరియల్‌ను తొలగించిందని వివరించారు.

**దోమల నివారణకు ఫోకస్**

ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా 3,109 ఇళ్లలో యాంటీ లార్వా ఆపరేషన్లు, 12 ప్రాంతాల్లో ఫాగింగ్,ఆరు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.11 వీధి కుక్కలను పట్టుకోవడంతో పాటు 13 కుక్కలకు వ్యాక్సినేషన్, 14 కుక్కలను షెల్టర్ హోమ్స్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో 93 మంది మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆరోగ్య అవగాహన కల్పించామని,795 మంది మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ పూర్తయిందని తెలిపారు. అర్బన్ బయోడైవర్సిటీ విభాగం ద్వారా 5.5 మెట్రిక్ టన్నుల చెట్ల కొమ్మలు, 1.5 మెట్రిక్ టన్నుల పార్కు వ్యర్థాలను తొలగించినట్లు వివరించారు.మాన్సూన్ డ్రైవ్‌ను సమర్థవంతంగా కొనసాగించేందుకు అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించినట్లు సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి జీహెచ్ఎంసీ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

## ప్రజా వాయిస్ వార్త ఎఫెక్ట్.. తహసీల్దార్ కార్యాలయ పరిసరాలు శుభ్రం



**ప్రజా వాయిస్ టేక్మాల్ :** తహసీల్దార్ కార్యాలయ పరిసరాల్లో నెలకొన్న అపరిశుభ్రతపై 'ప్రజా వాయిస్'లో సోమవారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. కార్యాలయం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు.
ఇటీవల తహసీల్దార్ కార్యాలయం పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని 'ప్రజా వాయిస్' వార్త ద్వారా వెలుగులోకి తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి పారిశుద్ధ్య సిబ్బందితో కార్యాలయ పరిసరాలను శుభ్రం చేయించారు.
పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు చెత్తాచెదారం తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

## హరిహరక్షేత్రం అయ్యప్పస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య




**ప్రజావాయిస్, ఇల్లందు ఆర్సీ:** ఇల్లందు పట్టణంలోని శ్రీహరిహరక్షేత్ర అయ్యప్పస్వామి దేవాలయాన్ని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మంగళవారం ఉదయం సందర్శించారు. ఈ మేరకు దేవాలయ ప్రధాన అర్చకులు ప్రదీపన్ శర్మ స్వాగతం పలుకగా అనంతరం ప్రత్యేక పూజలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆలయాన్ని సందర్శించినవారిలో ఇల్లందు నియోజకవర్గ ఆత్మకమిటీ చైర్మన్ బోడ మంగీలాల్ నాయక్, గణేశన్, సదానందం, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## సింగరేణి ఉద్యోగులకు క్వార్టర్స్ కౌన్సిలింగ్



**ప్రజావాయిస్, ఇల్లందు ఆర్సీ:** సింగరేణి ఇల్లందు ఏరియా జియం వి.కృష్ణయ్య ఆదేశానుసారం మంగళవారం నాడు జనరల్ మేనేజర్ కార్యాలయం నందు సింగరేణి ఉద్యోగులకు క్వార్టర్ సిటైపు, జేకే, ఓల్డ్ కాలనీలో గల యస్టి టైపు క్వార్టర్ కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. ఈ కౌన్సిలింగ్ లో తాజా ఎలాట్మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ కొరకు ధరఖాస్తు చేసుకున్న అర్హులైన ఉద్యోగులకు క్వార్టర్లు కేటాయించారు. ఈ సందర్భముగా అడిషనల్ ఎస్ఓటు జీఎం, ఏరియా క్వాలిటీ మేనేజర్ రామదాస్ మాట్లాడుతూ..అర్హత కలిగినవారికి క్వార్టర్ అలాట్మెంట్ ఉత్తర్వులు జారిచేయబడతాయని అలాగే క్వార్టర్ ఎలాట్మెంట్ కమిటివారు పూర్తి పారదర్శకంగా ఎలాంటి సిఫార్సులకు తావులేకుండా నిబంధనలకు అనుగుణంగా క్వాటర్లు ఇవ్వడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజియం పర్సనల్ అజ్మీర తుకారాం, ఏరియా ఇంజనీరు లక్ష్మణమూర్తి, సీనియర్ పర్సనల్ జి.సుధాకర్, జూనియర్ అసిస్టెంట్ జి.వీరన్న, తిరుపతి, జీఎం కార్యాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## బెజ్జూర్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ నితికా పంత్



**ప్రజా వాయిస్, బెజ్జూరు ఆసిఫాబాద్ :** కోమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ నితికా పంత్ మంగళవారం బెజ్జూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీసుల వందనం స్వీకరించి, సిబ్బంది పరేడ్‌ను పరిశీలించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలు, రికార్డులు, కార్యాలయ నిర్వహణను పరిశీలించి, స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. గ్రేవ్ కేసులు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, సీడీ ఫైళ్లు, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, బైండోవర్ కేసుల వివరాలను ఎస్సై సార్తజ్ పాషాను అడిగి తెలుసుకున్నారు.

## టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ స్టేట్ జనరల్ సెక్రటరీగా-వింజమూరి శేఖర్

**ప్రజా వాయిస్/దేవరకొండ ;** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఎస్సీ డిపార్ట్మెంట్ స్టేట్ జనరల్ సెక్రటరీగా నన్ను నియమించినందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి, టీపీసీసీ నాయకత్వానికి, ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర చైర్మన్ మరియు మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణకి మరియు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.నాపై విశ్వాసం ఉంచి ఇంతటి ముఖ్యమైన బాధ్యతను అప్పగించడం నాకు ఎంతో గౌరవంగా, బాధ్యతగా భావిస్తున్నాను. పార్టీ నాయకత్వం నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా అంకితభావంతో పనిచేస్తాను. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, భారత రాజ్యాంగం అందించిన సామాజిక న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం అనే విలువలకు కట్టుబడి పనిచేస్తూ, ఎస్సీ వర్గాల హక్కులు, ఎస్సీ వర్గాల సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడం, వాటి పరిష్కారం కోసం ప్రజల తరపున నిబద్ధతతో పనిచేయడం నా ప్రధాన లక్ష్యాలుగా పనిచేస్తాను.